# మహిళా సాధికారత

MAHILA SADHIKARATHA

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాసపత్రిక

mas

సంపుటి :17 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్టు 2019 పేజీలు : 36 వెల : రూ. 10/-


## అటూ ఇటూ 'దక్షిణం'-ఎఫ్ పి ఓ లపై 'మాస్' తో సమాలోచనం !






దక్షిణ దేశాలకు దక్షిణ దేశాల సహకార సంస్థ ప్రతినిధుల సదస్సు - దక్షిణ భారత ఎఫ్ పి ఓ ల ప్రతినిధుల సదస్సు





mas APDMP

'పల్లె జీవం' ప్రాజెక్ట్ కార్యక్రమాలపై ప్రత్యేక సంచిక

Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో





దక్షిణ భారత సదస్సులో శ్రీ మోహనయ్య ప్రసంగం - ప్రకాశం 'ఆత్మ' సమావేశంలో శ్రీ విజయకుమార్-జనజాగృతి రైతుదినోత్సవం





అనంతపురం జిల్లా గుడిబండ, రోళ్ళ మండలాలలో మాస్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న మాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి





పీలేరు నుంచి బెంగుళూరుకు అవగాహన పర్యటన - అరబిందో తోడ్పాటుతో పీలేరు విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ





ముదరందొడ్డి వాటర్‌షెడ్‌లో మాస్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన వనరులను పంచాయతీలకు అప్పగింత దృశ్యాలు





రామసముద్రం వాటర్‌షెడ్‌లో మాస్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన వనరులను పంచాయతీలకు అప్పగింత దృశ్యాలు

సంపాదకీయం



## జీవం !

'**మా**టకు ప్రాణము సత్యము...' అంటూ దేనికి ఏది ప్రాణమో సుమతీ శతకం ఒక చిన్న జాబితా చెబుతుంది. దస్తావేజుకు సంతకం, కోటకు గట్టి భటుల రక్షణ మొదలైనవి ఆ కోవలోవి. మాయల పకీరు ప్రాణం చిలుకలో వుందో లేదో కాని మనందరి ప్రాణం అన్నదాత రైతన్న చేతిలో, చేతలలో, చేలలో వుంది. కాని ఆ రైతన్నకు ప్రాణం పాడి,పంట! ఆ పాడి పంట సజావుగా సాగాలంటే అత్యవసరమైంది వాన, నీరు. ఆ నీరే కరవైంది. మన శరీరంలో 80 శాతం పైగా నీరే అనే వాస్తవాన్ని గుర్తిస్తే మన ప్రాణం నిలవడానికి నీటి అవసరం ఎంతో అర్థమవుతుంది. కాని ఏం లాభం? మనం ఆ నీటి ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యాన్ని విస్మరించి చేజేతులా విపత్తు కొనితెచ్చుకుంటున్నాం. వేసవిలో కనీస అవసరాలకు సరిపడా నీరు దొరకక ఇబ్బందిపడే పల్లెలు, పట్టణాలు ఎన్నో! ముదిరి పాకానపడిన చెన్నై పరిస్థితి మన కళ్ళెదుటే కనిపిస్తున్నది. కార్యాలయాలలో నీళ్ళులేక ఉద్యోగులను ఇంటి నుంచే పనిచెయ్యమంటున్నారు, హొటళ్ళలో నీరులేక మంచినీళ్ళివ్వలేం మహాప్రభో అంటూ మొరపెడుతున్నారు, ఆఖరుకు మరుగుదొడ్ల ముందు కూడా 'నీళ్ళు లేవు, గమనించగలరు, అర్థంచేసుకోగలరు' అనే బోర్డులు ! పర్యాటకులను తమ పర్యటనలను వాయిదా వేసుకోమని కోరవలసిన దుస్థితి. ఇవన్నీ నీటి విలువను మనకు చాటిచెప్పేవే. ఇక మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిస్థితే తీసుకుంటే దాదాపు మూడవ వంతుకు పైగా కరవు పీడిత ప్రాంతమే. ఏళ్ళ తరబడి వానలు కురవని గ్రామాలెన్నో! ఒక్క అనంతపురం జిల్లానే కాదు రాయలసీమలో చాలాచోట్ల, ప్రకాశం జిల్లాలోనూ కరువు తాండవిస్తుంటుంది. పంట వేయడానికి నీరుండదు. అసాధారణంగా తొలకరిలో ఏవో నాలుగు జల్లులు కురిసి, ఆశతో రైతు పంటవేస్తే ఆతర్వాత వాన జాడే వుండక ఆదాయం లేకపోగా పెట్టుబడి, శ్రమ నష్టపోతూ రైతు కుంగిపోతున్నాడు. చిన్న రైతుల పరిస్థితి మరీ దుర్భరం. ఈ ఏడాది ఎంత నష్టపోతామనే కాని, గండంగడిచి బయటపడతామన్న ధైర్యం లేకుండాపోయింది. ఇలాంటి విపత్తు నుంచి కరవు ప్రాంతాలలోని చిన్న రైతులను,నిరుపేదలను, పేదమహిళలను, చిన్న జీవాల పెంపకందారులను ఆదుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పల్లె జీవం' ప్రాజెక్టను అమలుచేస్తున్నది. 'మహిళాభివృద్ధి సొసైటీ' కూడా ఈ కృషిలో పాలుపంచుకుంటున్నది. ఆ కార్యక్రమాల విశేషాలను, వివరాలను మీరు ఈ సంచికలో తెలుసుకోవచ్చు.

జీవన వేదం

## వివేకం!

'**చ**దువది ఎంతగల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న ఆ చదువు నిరర్థకంబు' అంటూ, వివేకం పట్టుపడని చదువు ఎంత నిష్ప్రయోజనమో చెప్పాడు సోదాహరణంగా భాస్కర శతకకారుడు. రసజ్ఞత అంటే విస్తృతార్థంలో వివేకమే. రాజు సరోవరంలో స్నానమాడుతూ గట్టునవున్న ప్రియురాలిపై అదేపనిగా నీళ్ళు విరజిమ్మాడట. ఆమె ఆ నీటి తాకిడికి తట్టుకోలేక 'మోదకైస్తాడయ' అని నాటి రాజభాష సంస్కృతంలో మొరపెట్టుకున్నదట (మోదకైస్తాడయ అంటే మ ఉదకై: తాడయ ... నీళ్ళతో కొట్టవద్దు మహాప్రభో అని అర్థం). కాని, మన రాజుగారికి సంస్కృతం తెలీదు, సందర్భ జ్ఞానం అసలే లేదు. కాని తెలిసినట్టు నటించే భేషజం పుష్కలంగా వున్నది. మాటతో పాటు ఆమె చేసిన చేష్టనుబట్టి ఆమెపై నీళ్ళు చల్లడం ఆమెకు ఇష్టంలేదన్నంతవరకు మనవాడికి అర్థమైంది. ఆమె మాటలను మాత్రం 'రాజువైవుండి నీళ్ళతో కొట్టడమేమిటి? మోదకాలతో కొట్టు' అని అర్థంచేసుకున్నాడు. మోదకాలు అంటే మన లడ్డూల లాంటివి. వెంటనే బుట్టెడు లడ్డూలు తెప్పించి ఇక వాటితో కొట్టడం మొదలుపెట్టాడు. రాజు వెర్రిచేష్టకు ప్రియురాలికి చిర్రెత్తుకొచ్చి అక్కణ్ణుంచి సర్రున వెళ్ళిపోయింది. వివేకం, ఇంగితజ్ఞానం లేకుండా సాగించే నిర్వాకాలు ఎలా వుంటాయనేదానికి ఇదొక చక్కని ఉదాహరణ. నిజానికి పాఠశాల నాలుగు గోడల మధ్యనో, గురువు దగ్గరనో నేర్చుకున్నంత మాత్రాన చదువూ పూర్తి కాదు, వివేకమూ ఒంటబట్టదు. అది ఒక నిత్య కల్పము. ఎడతెగని ఆరోహణ పర్వం. గురువు నేర్ప గలిగేది నాలుగవ వంతేనట. మరో నాలుగవ వంతు శిష్యుడు తన బుద్ధికి పదునుపెట్టి నేర్చుకుంటూ, ఇంకొక నాలుగవ వంతు తోటి విద్యార్థుల నుంచి, సమాజం నుంచి గ్రహించగలగాలి. ఇక మిగిలిన నాలుగవ వంతు కాలక్రమంలో, జీవిత పర్యంతం నేర్చుకుంటూనే వుండాలంటూ 'ఆచార్యాత్ పాదమాదత్తే...' అనే శ్లోకం తెలుపుతుంది. బుద్ధిశాలి కావాలంటే గురువుకు శుశ్రూష చేయడం, గురుబోధ ఏకాగ్రతతో వినడం, విన్నదానిని గ్రహించడం, దానిని పలుమార్లు మననంచేయడం, దానిలోని నిజానిజాలను విశ్లేషించడం ... ఇలా ఇంత చేస్తే కాని తత్వం బోధపడదని ' శుశ్రూషా శ్రవణంచైవ ...' అనే మరో శ్లోకం చెబుతుంది. ఇంతటి కృషి వుంటేనే స్వయం ప్రతిభ, స్వ ప్రకాశం చేకూరుతాయి. సొంత తెలివితేటలు లేనివారి గురించి మరోశ్లోకం 'అయ్యా, నీకు బుర్ర లేకుంటే ఎన్నిశాస్త్రాలు చదివినా ఏమిటి లాభం? గుడ్డి వారికి అద్దంవల్ల ఒరిగేదేముంటుంది?' అంటూ అవహేళన చేస్తుంది. నిజమే, వెలగని దీపం వుండీ ఏం ప్రయోజనం?

*ఆసక్తికలిగినవారి కోసం ఆ శ్లోకం:*

**యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి కిం?**
**లోచనాభ్యాం విహీనస్య దర్పణం కిం కరిష్యతి?**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

జలమే జనం, జలమే ధనం, జలమే బలం ; సుజలాం, సుఫలాం

## లోపలి పేజీలలో ....


➪ కరువును జయించే ఆయుధం 'పల్లెజీవం' ! ...05
➪ రైతుల ముంగిట్లో 'జీవ వనరుల కేంద్రం' ! ...06
➪ ఎఫ్ పి ఓలకు వ్యాపార దక్షత పై జిఐజడ్ సదస్సు ...07
➪ దక్షిణాది రాష్ట్రాలలో ఎఫ్‌పిఓల అనుభవాలు.. ...08
➪ మహిళా భాగస్వామ్యంతో 'పల్లె'లకు 'జీవం'! ...09
➪ 'పల్లె జీవం'తో నిరుపేద మహిళలకు ఆసరా ...11
➪ విత్తన వ్యాపారంలో మహిళా డైరెక్టర్ల విజయం ...14
➪ గ్రామ స్థాయిలో సైలేజ్ తయారీ విధానం ...16
➪ ఎఫ్ పి ఓ ల ద్వారా విత్తనాల వ్యాపారం ...18
➪ వర్షానికి ముందే వట్టి దుక్కిలో విత్తడం ! ...20
➪ ఎఫ్ పి ఓల రేటింగ్‌కు అనుసరించే విధానం ...21
➪ నవధాన్య పద్ధతి సాగుపై రైతులకు అవగాహన ...22
➪ 'పల్లె జీవం'లో సన్నజీవాల బడి కార్యక్రమం ...23
➪ చిన్నజీవాలకు మెరుగైన యాజమాన్య పద్ధతులు ...24
➪ ఎఫ్ పి ఓ ల సేవలపై ముమ్మరంగా ప్రచారం ...25
➪ దేశీ కోళ్ళ పెంపకం, వ్యాధుల నివారణ ...26
➪ మాస్' ప్రేరణతో మహిళా సంఘాల ముందడుగు ...27
➪ ఐపాడ్ బృందం క్షేత్ర సందర్శన ! ...28
➪ తెలుసుకుని, తెలియజెప్పిన సమాఖ్య లీడర్ ...30
➪ ఆరోగ్య బంధన్' తో బలపడిన అనుబంధం ! ...31
➪ కంద, చేమదుంప నాటుకుందాం ...32
➪ బి.పి.ని అదుపుచేసే ఆహారనియమాలు ...33
➪ వాటర్‌షెడ్ వనరులు పంచాయతీలకు అప్పగింత ...34


### మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్ళకు | మూడేళ్ళకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

### ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం): | రూ. 25,000 |
| మల్టీకలర్ బ్యాక్ పేజి (పూర్తి): | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి): | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి): | రూ. 10,000 |

➪ చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి


ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి

అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి:

ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి,

ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్

ఎన్. రమాదేవి

కన్సల్టెంట్ కె.రఘురామరాజు


గమనిక: 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


**మహిళా సాధికారత**

ఏపిమాస్ కార్యాలయం,

ప్లాట్ నెం.11-12, హుడా కాలని,

తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర,

మణికొండ, రంగారెడ్డి జిల్లా,

హైదరాబాదు-500089

ఫోన్స్ : 08413-403118/19/20

ఫాక్స్ : 08413-403117

Web:www.apmas.org

E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# కరువును జయించే ఆయుధం 'పల్లెజీవం' !

– కిల్లి. జయరాం

కరువును నివారించి, కరువు సృష్టించే కల్లోలాన్ని, కడగండ్లను తప్పించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బృహత్ కార్యక్రమం 'పల్లె జీవం'. దీనినే సాంకేతిక పరిభాషలో 'ఆంధ్రప్రదేశ్ డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్ట్' (ఆంధ్రప్రదేశ్ కరువు నివారణ పథకం) అని, సంక్షిప్తంగా 'ఏ పి డి ఎం పి' అని అంటారు. ప్రధానంగా కరువుకు గురవుతున్న పేద రైతులను ఆదుకోవడం ఈ పథకం లక్ష్యం.

రాష్ట్రంలో తీవ్రంగా కరువుకు గురవుతున్న ఐదు జిల్లాలలో ఈ ప్రాజెక్ట్‌ను అమలు జరుపుతున్నారు. అవి: అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాలు. ఈ జిల్లాలలో 105 మండలాలలో, మొత్తం 305 గ్రామ పంచాయతీలలో పల్లెజీవం అమలవుతున్నది. చిన్న, సన్నకారు మెట్ట రైతులు, నిరుపేదలు, భూమిలేని పేదలు, ఎస్ సి, ఎస్ టి లు, ఇతర బలహీన వర్గాలకు చెందిన 1,65,000 వ్యవసాయ కుటుంబాలకు లబ్ధి చేకూర్చడం ఈ ప్రాజెక్ట్ ఆశయం.

పల్లెజీవం ప్రాజెక్ట్ మహిళలకు కూడా పెద్దపీట వేసింది. ఈ ప్రాజెక్ట్ కింద చేపట్టే ప్రతి కార్యక్రమంలో నిర్ణీత నిష్పత్తిలో మహిళల భాగస్వామ్యం వుండాలని ప్రభుత్వం నిర్దేశించింది. పైన పేర్కొన్న కుటుంబాలకు చెందిన మహిళలతోపాటు, ఏ ఆసరాలేని మహిళలు, ఒంటరి మహిళలు మొదలైన వారందరూ ఈ పథకం లబ్ధిదారులే. పేద రైతులతోపాటు పశుపోషకులు, చిన్న జీవాల పెంపకందారులు కూడా ఈ ప్రాజెక్ట్‌వల్ల ప్రయోజనాలను పొందగలుగుతారు.

పల్లె జీవం పథకంలో మూడు ప్రధానమైన అంశాలు వున్నాయి. అవి: (1) కరువును తట్టుకుని, వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసే ఉత్పాదక వ్యవస్థలను రూపొందించడం (2) సహజ వనరుల సక్రమ యాజమాన్యం, నీటి సమర్థ నిర్వహణ ద్వారా కరువును అధిగమించడం (3) ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి జిల్లాలస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో తగిన నిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఇందులో భాగంగా 'వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల' (ఎఫ్ పి ఓ ల) ఏర్పాటుకు ప్రాధాన్యం యిస్తారు.

ఈ ప్రాజెక్ట్ నిర్వాహక యంత్రాంగం ఈ ఐదు జిల్లాలలో వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్ట్ అమలుజరిగేలా చూస్తుంది.

**ఏపిమాస్ భాగస్వామ్యం**

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రముఖ సాంకేతిక వనరుల సంస్థగా పేరొందిన ఏపిమాస్ కూడా ఈ విశిష్ట పథకంలో భాగస్వామిగా వుండడం ఒక విశేషం. అనంతపురం జిల్లాలోని 12 మండలాలలో ఏపిమాస్ 'పల్లెజీవం' ప్రాజెక్ట్ భాగస్వామిగా వున్నది. వీటిలో 3 మండలాలను (గుడిబండ, అగలి, రోళ్ళ) 'ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ' (ఎఫ్ ఏ) గా స్వయంగా నిర్వహిస్తూ, మిగిలిన 9 మండలాలలో మూడు స్థానిక ఎన్ జి ఓ లకు 'లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ' (ఎల్ ఎఫ్ ఏ) గా మార్గదర్శకత్వం వహిస్తున్నది. నంబులపూల కుంట, అమడగూరు, తలుపుల మండలాలలో 'ఎఫ్ ఇ ఎస్' ; తనకల్లు, లేపాక్షి, మడకసిర మండలాలలో 'జన జాగృతి' ; గాండ్లపెంట, ఒ డి చెరువు మండలాలలో 'అన్నదాత మ్యాక్స్' సంస్థలు ఏపిమాస్ మార్గదర్శకత్వంలో ఫెసిలిటేటింగ్ ఏజెన్సీలుగా ఏపిమాస్ మార్గదర్శకత్వంలో పల్లెజీవం కార్యక్రమాన్ని అమలుజరుపుతున్నాయి.

పంటలకు రక్షిత నీటి సదుపాయం కల్పించడం, భూసారాన్ని, నీటిపారుదల సామర్థ్యాన్ని పెంపొందించడం, సాగుచేసే పంటలలో వైవిధ్యం తీసుకురావడం, పాడిపశువుల ఉత్పాదక శక్తిని పెంచడం, నీటి సక్రమ యాజమాన్యం, జల సంరక్షణ, వివిధ వ్యవసాయ పెట్టుబడులను అందించి రైతును ఆదుకోవడం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, చౌకగా అద్దెకు వ్యవసాయ యంత్ర పరికరాల అందుబాటు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం మొదలైన సేవలతో పల్లెసీమలలో కొత్త వెలుగులు నింపడానికి పల్లెజీవం పథకం కృషి చేస్తున్నది. ■

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకమీద ఆధారపడి వుంటుంది !

# రైతుల ముంగిట్లో 'జీవ వనరుల కేంద్రం' !

– కాళేశ్వర్

వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టి రసాయన ఎరువులు, రసాయన పురుగు మందులతో చేసే వ్యవసాయం వల్ల రైతు నష్టపోతున్నాడు. ఈ రసాయనిక ఎరువులు, పురుగు మందులతో భూమి కూడా కలుషితం అవుతున్నది. పైగా



రసాయనికాలతో పండించిన ఆహారం తినడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. కాబట్టి ఈ సమస్యలను ఎదుర్కొని ప్రతి రైతు వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో ప్రకృతి వ్యవసాయం చేసి ఎక్కువ ఆదాయం పొందాలనే ఆకాంక్షతో 'జీవ వనరుల కేంద్రం' (బి అర్ సి) ఏర్పాటు చేయడం జరిగింది. ఎఫ్ పి ఓ సభ్యులైన రైతులకు ఎఫ్ పి ఓ కేంద్రంలో, క్లిక్ సెంటర్ లో అందుబాటులో కషాయాలు, జీవ కారకాలు లభించడం వల్ల వారు సులువుగ ఉపయోగించగలుగుతారు.

ఆంధ్రప్రదేశ్ కరువుసంసిద్ధతా పథకం ద్వారా 'మహిళా అభివృద్ధి సొసైటీ' (మాస్) అమలు చేస్తున్న "పల్లెజీవం" కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా గుడిబండ మండలంలోని మందలపల్లి గ్రామంలో శ్రీ సిద్దేశ్వర రైతు సంఘం(ఎఫ్ పి ఓ) ఏర్పాటైంది. ఈ రైతు సంఘం ద్వారా ఏపిడిఎంపి ప్రాజెక్ట్ "జీవ వనరుల కేంద్రాన్ని" ఏర్పాటు చేసింది.

దీనికి సంబంధించి మండల రైతు సమాఖ్య ఒక ఔత్సాహిక రైతును(శ్రీ శివన్న, సి సి గిరి గ్రామం) ఎంపిక చేసి జిల్లా ఎంపిక కమిటీకి ఆయన పేరును సిఫారసు చేసింది. జిల్లా ఎంపిక కమిటీ రైతు అనుభవం, ఉత్సుకత చూసి కర్నూలు జిల్లా యాగంటిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి మూడు రోజుల శిక్షణకు పంపించింది. శిక్షణ అనంతరం జీవ వనరుల కేంద్ర ఎంటర్‌ప్రెన్యూర్‌గా వుండడానికి అంగీకార పత్రం తీసుకొని, ఎఫ్ పి ఓ రైతు భాగస్వామ్యం నిమిత్తం 7000



రూపాయలు కట్టించుకొని, ఉత్పత్తి కేంద్రం, అమ్మకం కేంద్రానికి సరిపడా 75,000 రూపాయలు విలువ చేసే బి అర్ సి పనిముట్లను (వెట్ గ్రైండర్, ఫ్రిట్జ్, డ్రమ్ములు, స్టౌ ఇతర పరికరాలను) ఇచ్చారు. ఈ జీవ వనరుల కేంద్రంలో తయారు చేసే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం సేంద్రియ ద్రావకాలను, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, వావిలాకు కషాయం, పంచపత్ర కషాయం, దశపత్ర కషాయం, గర్లకంట కషాయం, కోడిగ్రుడ్ల కషాయం వంటి మరెన్నో కషాయాలను తయారు చేసి శ్రీ సిద్దేశ్వర రైతు సంఘానికి సంబంధించిన క్లిక్ సెంటర్ లో పెట్టి ఈ పదార్థాలను తక్కువ ధరలకే అందరి రైతులకి అమ్ముతున్నారు. ఎంటర్ ప్రెన్యూర్ శిక్షణ పొందిన శ్రీ శివన్న ఇప్పటివరకు 18000/– రూపాయల కషాయాల వ్యాపారం చేశారు. ఇటువంటి జీవ వనరులను మరెందరో సభ్య రైతులకు అందించడానికి ఈ జీవ వనరుల కేంద్రం సిద్ధంగా వున్నది. ■


ముందడుగుతో బలం, కలసి నడవడంతో ఐకమత్యం, ఒకరికొకరు నిలవడంతో అనుబంధం

# ఎఫ్ పి ఓ లకు వ్యాపార దక్షత పై జి ఐ జడ్ సదస్సు

– మధువని

**చి**న్న కమతాల సాగు ఎక్కువగా వుండే ఇండియా వంటి దేశాలలో రైతులు ఆర్థికంగా బలపడాలంటే సహకార సంఘం రూపంలోనో, కంపెనీ రూపంలోనో వారు సంఘటితమై వ్యవసాయ ఉత్పత్తుల విలువ గొలుసులో తమ ప్రాతినిధ్యాన్ని పెంపొందించుకోవడం అవసరం. ఈ ఆవశ్యకతకు అనుగుణంగా భారతదేశంలో రైతు సహకార వ్యవస్థకు వంద సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నది. గుజరాత్‌లోని సుప్రసిద్ధమైన 'అమూల్' పాడి రైతుల సహకార సంస్థ, తెలంగాణాలోని 'ముల్కనూరు రైతు సహకార సంఘం' ఈ కోవలోనివే.






జర్మనీకి చెందిన జి ఐ జడ్ సంస్థ ఇండియాతో పాటు ఇథియోపియా, మొజాంబిక్, కేమరూన్ వంటి దేశాలలో 'హరిత నవీకరణ కేంద్రా'లను (గ్రీన్ ఇన్నొవేషన్ సెంటర్స్– జి ఐ సి లను) నెలకొల్పి, వాటి సభ్య సంస్థలుగా రైతులు 'వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ లను' (ఎఫ్ పి ఓ లను) ఏర్పాటు చేసుకుని సుస్థిరాభివృద్ధి సాధించ డానికి తోడ్పాటు అందిస్తున్నది. ఇండియాలో జి ఐ జడ్ భాగస్వామిగా 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) జి ఐ సి ల ఏర్పాటు, ఎఫ్ పి ఓ ల బలోపేతానికి కృషి చేస్తున్నది.

ఈ నేపథ్యంలో మాస్, డి జి ఆర్ వి సంస్థల తోడ్పాటుతో జి ఐ జడ్ తన ఆఫ్రికన్ దేశాల భాగస్వామ్య సంస్థల ప్రతినిధులకు ఇండియాలో ఎఫ్ పి ఓ లను ప్రోత్సహించడంలో జి ఐ సి లు అనుసరిస్తున్న పద్ధతులు, ఎఫ్ పి ఓ ల వ్యాపార దక్షత, నిర్వహణ, యాజమాన్యం మొదలైన అంశాలపై జులై 14 నుంచి 24 వ తేదీ వరకు హైదరాబాద్, బెంగుళూరులో క్షేత్ర పర్యటనలు, సదస్సులు నిర్వహించింది.

విషయ నిపుణుల ప్రెజెంటేషన్లు, ఎఫ్ పి ఓ సభ్య రైతులను కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకోవడం, బృందాలుగా ఏర్పడి చర్చిచడం, విజయవంతంగా పని చేస్తున్న ఎఫ్ పి ఓ లను సందర్శించడం మొదలైన వివిధ అవగాహనా కార్య క్రమాలను నిర్వహించారు.

హైదరాబాద్‌లోని 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) శిక్షణ కేంద్రంలోను, బెంగుళూరులోని సి ఇ ఓ సెంటర్ లో సదస్సులు నిర్వహించగా, మదనపల్లి, మైసూరులలో మాస్, జిఐజడ్ ప్రాజెక్టుల పని తీరును పరిశీలించ డానికి అవగాహన పర్యటనలను నిర్వ హించారు. ■



ఇతరులు చూడలేనిదానిని చూడగలగడమే దార్శనికత్వం, సాధించడమే సామర్థ్యం

# దక్షిణాది రాష్ట్రాలలో ఎఫ్ పి ఓ ల అనుభవాలపై గోష్ఠి !

– మధువని

మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలతో (ఎఫ్ పి ఓ లతో) కలసి పనిచేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఎఫ్ పి ఓ లు పటిష్ఠమైన సంస్థలుగా ఎదిగి, స్వయం నిర్వహణతో, సుస్థిరాభివృద్ధి సాధించే విధంగా వాటిని ప్రోత్సహించడానికి అనుసరించవలసిన వ్యూహాల గురించి, సంబంధిత వివిధ సమస్యల గురించి చర్చించి, అనుభవాలను పంచుకుని, పరిష్కార మార్గాలను అన్వేషించడంకోసం జులై 12 వ తేదీన దక్షిణాది రాష్ట్రాల ఎఫ్ పి ఓ ప్రోత్సాహక సంస్థలు, సంబంధిత ప్రభుత్వ ప్రభుత్వేతర ప్రతినిధుల చర్చా కార్యక్రమాన్ని 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) హైదరాబాద్‌లోని తన ప్రధాన కార్యాలయంలోని శిక్షణ కేంద్రంలో నిర్వహించింది.





ఎఫ్ పి ఓల జాతీయ సంఘం (ఎన్ ఏ ఎఫ్ పి ఓ) తో కలసి మాస్ నిర్వహించిన ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ, ఉద్యాన శాఖల ప్రతినిధులు, నాబార్డ్, ఎస్ ఎఫ్ ఏ సి, ఆర్థిక సంస్థలు, ప్రోత్సాహక సంస్థలు, ఎఫ్ పి ఓ ల ప్రతినిధులు, విషయ నిపుణులు, తదితర సంబంధిత ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల కడగండ్లు తొలగి, ఎఫ్ పి ఓ లు పూర్తిగా రైతుల యాజమాన్యంలోనే నిర్వహింపబడుతూ, రైతులకే చెందాలంటే రాష్ట్రాల స్థాయిలో అనేక విధాలైన చర్యలు అవసరమవుతాయని ఈ గోష్ఠి అభిప్రాయపడింది.

రాష్ట్ర స్థాయిలో ఎఫ్ పి ఓ లకు వున్న అవకాశాలను, అవి ఎదుర్కొంటున్న సమస్యలను, ఇతర రాష్ట్రాలలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను వాస్తవిక దృక్పథంతో అవగాహన చేసుకుని అనువైన విధానాలను రూపొందించి అమలు చేయాలని ఈ గోష్ఠి ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నది.

వివిధ సంస్థల తోడ్పాటుతో బహుళ భాగస్వామ్య విధానాన్ని అనుసరించాలని గోష్ఠి సూచించింది. ఎఫ్ పి ఓ లు క్రమేణా సుస్థిర వ్యాపార సంస్థలుగా ఎదిగేలా ప్రోత్సాహక సంస్థలు కృషి చేయాలని కూడా గోష్ఠి అభిప్రాయపడింది. ఇందుకోసం ఎఫ్ పి ఓ లకు తగినంత ఆర్థిక సహకారం కూడా అందించాలని ఈ సమావేశం కోరింది. ఉత్పత్తుల విలువను పెంచుకోగలగడం, ఉప ఉత్పత్తుల కంపెనీలతో, మార్కెట్ లోని ప్రధాన సంస్థలతో చక్కని అనుసంధానం కలిగి వుండడం ఎఫ్ పి ఓ లకు ఎంతైనా అవసరమని గోష్ఠి భావించింది.

ఎఫ్ పి ల రంగంలోని ప్రధాన సూత్రధారులను, పాత్రధారులను ఒకే వేదికపైకి తెచ్చి, వారు తమ అనుభవాలను పంచుకుని, సమస్యలపై కలసికట్టుగా ఆలోచించేలా చేయడంలో ఈ గోష్ఠి విజయవంతమైంది. ■

బలం అంటే ఇష్టంలేనివాటిని నాశనం చేయడం కాదు, ఇష్టమైనవాటిని కష్టమైనా సృష్టించుకోవడం

# మహిళా భాగస్వామ్యంతో 'పల్లె'లకు 'జీవం'!

– ఫక్రున్నిసా

మన దేశం సామాజికంగా, సాంకేతికంగా అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నది. అన్ని రంగాలలో పురుషుల, స్త్రీల భాగస్వామ్యం ఉన్నది. కానీ స్త్రీ భాగస్వామ్యం అనేది అంతత మాత్రాన ఉన్నది. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో దుక్కి దున్నినప్పటినుంచి పంట కోత వరకు మహిళా భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుంది. పంట అమ్మకం, మార్కెటింగ్ విషయానికొస్తే అక్కడ మహిళా భాగస్వామ్యం ఉండదు, నిర్ణయాధికారం ఉండదు. ఏ పంట వేయాలి, ఎక్కడ అమ్మాలి అనే విషయంలో మాత్రం మగవారి నిర్ణయమే సాగుతుంది. వ్యవసాయంలో మహిళల శ్రమను గుర్తించటం లేదు. అన్ని రంగాల్లో, అన్ని కార్యక్రమాల్లో మహిళలకు



పురుషులతో సమాన అవకాశాలు, అధికారాలు కల్పించడానికి తీసుకు రావడానికి అంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరవు సంసిద్ధత పథకాన్ని తీసుకువచ్చింది. దీన్నే 'పల్లెజీవం కార్యక్రమం' అని అంటున్నాం.

ఏపిమాస్ లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజన్సీ (ఎల్ ఎఫ్ ఏ) గా అనంతపురం జిల్లాలోని పన్నెండు మండలాలలో స్వయంగా తాను అమలు జరపడంతో పాటు జనజాగృతి, ఫౌండేషన్ ఫర్ ఎకాలజికల్ సెక్యూరిటీస్, అన్నదాత సంస్థలు ఫెసిలి టేటింగ్ ఏజన్సీ లుగా (ఎఫ్ ఏ) వాటితో కలిసి పని చేస్తున్నది.

పల్లె జీవంలో చేపట్టే ప్రతి కార్యక్రమంలో మహిళా భాగస్వామ్యం కోసం, రైతు సంస్థల బలోపేతం కోసం, పల్లె జీవం పథకంలో కార్యక్రమాలను నాణ్యతగా నిర్వహించడం



కోసం ఏపిమాస్ సంస్థ రాజీలేని సూత్రాలను ఏర్పాటు చేసుకొని వాటిని కచ్చితంగా పాటిస్తున్నది.

**రాజీలేని సూత్రాలు**

- ప్రతి రైతు సంస్థలో 40% మహిళలు సభ్యులుగా ఉండాలి
- ఎఫ్ పి ఓ పాలక వర్గంలో 50% మహిళలు సభ్యులుగా ఉండాలి
- ఎఫ్ పి ఓ పదాధికారులలో కనీసం ఒక మహిళ వుండాలి
- అన్నిరకాల కమిటీలలో మహిళలు సభ్యులుగా ఉండాలి
- ప్రతి కార్యక్రమంలో లబ్ధిదారులుగా 50% మహిళలు ఉండాలి
- మహిళలకు కష్టం తగ్గించే పనిముట్లను వ్యవసాయ పరికరాలను ఎఫ్.పి.ఓ లో అందుబాటులో ఉంచాలి
- ప్రతి అంశంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి



మన మనస్సు ఒక ఆయస్కాంతం ! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది

## పల్లెజీవంలో మహిళా భాగస్వామ్యం వివరాలు

| వ సం | వివరాలు | అగళి | | | రొళ్ళ | | | గుడిబండ | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | మహిళలు | పురుషులు | మొత్తం | మహిళలు | పురుషులు | మొత్తం | మహిళలు | పురుషులు | మొత్తం |
| | సంస్థాగత నిర్మాణం... ఎఫ్ పి ఓ | | | | | | | | | |
| 1 | వాటాదారులు | 206 | 159 | 365 | 211 | 239 | 450 | 152 | 248 | 400 |
| 2 | కమిటీ సభ్యులు | 5 | 4 | 9 | 5 | 7 | 12 | 6 | 6 | 12 |
| 3 | పదాధికారులు | 1 | 2 | 3 | 1 | 2 | 3 | 1 | 2 | 3 |
| 4 | సలహా కమిటి | 4 | 4 | 8 | 4 | 4 | 8 | 4 | 4 | 8 |
| 5 | కొనుగోలు కమిటీ | 2 | 3 | 5 | 2 | 3 | 5 | 2 | 3 | 5 |
| 6 | వాతావరణ జీవనో పాదుల కేంద్రం సిబ్బంది | 2 | 3 | 5 | 3 | 2 | 5 | 2 | 3 | 5 |
| 7 | పారావర్కర్లు | 3 | 0 | 3 | 1 | 2 | 3 | 2 | 1 | 3 |
| | సంస్థల సామర్థ్య పెంపుదల | | | | | | | | | |
| 9 | ఎఫ్ పి ఓ గూర్చి శిక్షణలు | 30 | 42 | 72 | 35 | 45 | 80 | 45 | 30 | 75 |
| | రైతు బడి | 10 | 20 | 30 | 10 | 20 | 30 | 10 | 20 | 30 |
| 10 | వ్యవసాయ క్షేత్ర దినోత్సవం | 158 | 66 | 92 | 66 | 114 | 180 | 38 | 113 | 151 |
| 10 | నిరుపేదల గుర్తింపు | 180 | 28 | 208 | 155 | 72 | 227 | 204 | 131 | 333 |
| 11 | రైతు సంఘాలు | 158 | 207 | 365 | 211 | 239 | 450 | 152 | 248 | 400 |
| 12 | కార్యక్రమాలు జెబా పంపిణీ లబ్దిదారులు | 10 | 15 | 25 | 5 | 15 | 25 | 10 | 15 | 25 |
| 13 | రక్షకతడుల లబ్దిదారులు | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 5 | 10 | 15 |
| 14 | ఎఫ్ పి ఓ ద్వారా వివిధ సేవలు పొందిన లబ్దిదారులు | 65 | 187 | 252 | 106 | 244 | 350 | 24 | 62 | 100 |

■

తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !

# 'పల్లె జీవం'తో నిరుపేద, ఒంటరి మహిళలకు ఆసరా !

– టి. ప్రభావతి

అనంతపురం జిల్లాలోని నంబుల పూలకుంట, అమడగూరు, తలుపుల మండలాలలో ఏపిమాస్ లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ (ఎల్ ఎఫ్ ఏ) గా, ఎఫ్ ఇ ఎస్ సంస్థ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ (ఎఫ్ ఏ) గా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "పల్లె జీవం" కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నది. ఈ పల్లె జీవం ప్రప్రథమంగా మహిళలకు పెద్ద పీట వేసింది అనడంలో అతిశయోక్తి లేదు.

ముఖ్యంగా వీరు పేద కుటుంబాలకు చెందిన మహిళలు, ఒంటరి మహిళలు, మహిళా యాజమాన్య రైతు కుటుంబాలు, సన్న జీవాలపై ఆధారపడిన మహిళా కుటుంబాలు, ఎస్ సి, ఎస్ టి కుటుంబాలకు చెందిన వారు, చిన్న సన్నకారు మహిళా రైతులు, భూమి లేని కుటుంబాలకు చెందిన మహిళలు అందరూ ఈ పల్లె జీవంలో భాగస్వాములు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇలాంటి మహిళలను పి ఆర్ ఏ మ్యాపింగ్ పద్ధతి ద్వారా ప్రతి క్లస్టర్ లోనూ వంద మందిని గుర్తించారు. వీరందరికి పల్లె జీవం పథకంలో చేపట్టే రక రకాల పనులలో, కార్యక్రమాలలో అవకాశం కల్పించడం జరుగుతున్నది.



ముఖ్యంగా భూమిలేని పేద మహిళలకు, ఒంటరి మహిళల కోసం పెరటి కోళ్ళ పెంపకం కార్యక్రమం అమలవుతున్నది. సహజ వనరుల యాజమాన్య అభివృద్ధి పనులలో భాగంగా జీవనేలల కింద చేపట్టబోయే ఫారం పాండ్ల తవ్వకం, చెరువు మట్టి పొలాలకు తోలడం, ఎరువు గుంతలు తవ్వడం, ఎరువు గుంతల చుట్టూ చెట్లు నాటడం, ఎరువు గుంతలలో ఎరువు తయారు చేయడం మొదలైన పనులను ప్రతిపాదించారు. ఇందులో 30% మహిళలకు భాగస్వామ్యం కల్పించారు.

**రైతు బడి**

పల్లె జీవంలో ముఖ్యమైనది రైతు బడి కార్యక్రమం. నెలలో రెండు సార్లు అంటే, 15 రోజులకు ఒకసారి వంతున



నంబులపూలకుంటలో ప్రతి నెల 6వ తేదీ, 20వ తేదీ; తలుపుల మండలంలో ప్రతి నెల 8వతేదీ, 22వ తేదీ; ఆమడగూరు మండలంలో ప్రతి నెల 10వ తేదీ , 24వ తేదీ రైతుబడి జరుగుతుంది.

ఈ రైతు బడి కార్యక్రమంలో కనీసం 30 మంది రైతులు పాల్గొంటారు. వీరిలో ఇద్దరు మాస్టర్ ఫార్మర్లు వుంటారు. వీరిలో తప్పనిసరిగా మహిళా రైతు ఒకరు వుంటారు. మొత్తం 30 మందిలో 50% మహిళలు వుంటారు.

ఈ రైతు బడి ద్వారా నేర్చుకున్న అంశాలను, పద్ధతులను ముఖ్యంగా ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య, పంచ పత్ర కషాయం, గరళ కంఠ కషాయం, నీమాస్త్రం, వావిలాకుల కషాయం, పచ్చి మిర్చి–వెల్లుల్లి కషాయం మొదలైన కషాయాల తయారీ ; జెబా వాడే విధానం, వేస్ట్ డీ కంపోసర్, బోర్డో పేస్ట్ మొదలైనవి అన్నీ నేర్చుకొని వారి వారి పంట పొలాలలో పాటిస్తున్నారు.



గుణపాఠం నేర్పేవి తప్పులే కావు, ఏ గుణపాఠం నేర్వనిదే అసలైన తప్పు



ఇందులో మహిళల భాగస్వామ్యం అత్యంత ప్రధానమైనది.

ఎఫ్ పి ఓ లో మహిళలు కార్యవర్గ సభ్యులుగా వున్నారు. ఎఫ్ పి ఓ పరిధిలో జరిగే వివిధ కార్యక్రమాల్లో, వ్యాపార కార్యకలాపాల్లో, వివిధ కమిటీలలో అనగా కొనుగోలు కమిటీ, నాణ్యత కమిటీ, పంపిణీ కమిటీ, సహజ వనరుల యాజమాన్య కమిటీ, పర్యవేక్షణ కమిటీ మొదలైన వాటిలో మహిళలు భాగస్వాములుగా వుండి రైతు సంఘాన్ని విజయవంతంగా అభివృద్ధి పథంలో నడుపుకుంటున్నారు.

సి హెచ్ సి వ్యవసాయ పనిముట్ల అద్దె కేంద్రం, కషాయాల కేంద్రం, రైతు సేవా కేంద్రాలలో కూడా పురుషులతో పాటు మహిళలు కూడా వుండి ఈ పల్లె జీవం కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ లబ్ధి పొందుతున్నారు. వివిధ రకాల శిక్షణల ద్వారా నైపుణ్యా లను పెంచుకొని సమాజంలో మహిళలు కూడా ముందంజలో వుండడానికి ఈ పల్లె జీవం ఒక వేదికగా, ఆసరాగా నిలిచింది.

**ఒంటరి మహిళలకు అండ**

పల్లె జీవం కార్యక్రమంలో ఒంటరి మహిళలకు, మహిళా యాజమాన్యం కలిగిన, అత్యంత నిరుపేద కుటుంబాలు, కనీసం 100 కుటుంబాలను భాగస్వామ్యం చేసి వారిని కరువు, వ్యవసాయ సంక్షోభం నుంచి తట్టుకునేల అభివృద్ధి చేయడం ఒక ముఖ్య ఉద్దేశం. పల్లె జీవంలోని ఏ రకమైన అభివృద్ధి కార్యక్రమంలో అయినా వీరికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలి.

ఇందులో భాగంగానే అనంతపురం జిల్లా నంబుల పూలకుంట మండలంలోని మర్రికొమ్మదిన్నె, తూర్పు నడింపల్లె, గౌకనపల్లె అనే మూడు గ్రామ పంచాయతీలలో 100 మంది నిరుపేద, ఒంటరి మహిళలను 'పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్' (పి అర్ ఏ) ద్వారా గుర్తించడం జరిగింది.

ఈ పి అర్ ఏ కార్యక్రమంలో పల్లెలోని ప్రతి ఇంటిని ఒక సోషల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తారు. ప్రతి వీధి నుండి ఒక మహిళను ఇందులో భాగస్వామ్యం చేసి ఈ మ్యాప్‌ను రూపొందించారు. ప్రతి కుటుంబ యజమాని పేరు వ్రాస్తూ అందులోనే ఒంటరి మహిళలు వున్న కుటుంబాలను వారి ద్వారానే గుర్తిస్తారు.

**ఒంటరి మహిళలు అనగా...**

- భర్త చనిపోయిన వారు
- భర్త వదిలేసిన వారు



- విడాకులు తీసుకున్న వారు
- 30 సంవత్సరాలు నిండి ఇంకా పెళ్ళి కాని వారు
- మహిళా ఆధారిత కుటుంబాలు
- భర్త వుండి వ్యవసాయ కార్యక్రమాలు భార్య చూసుకునే కుటుంబాలు
- కుటుంబ భారం, పిల్లల బాధ్యతలు, పోషణ, చదువు అన్నీ మహిళల మీదే వుండి జీవనం సాగిస్తున్న కుటుంబాలు

**ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు**

- పంట ఉత్పత్తులకు కాపలా
- అధిక బరువు కలిగిన విత్తనాలు, పనిముట్లు తరలింపు
- పెట్టుబడులు సమకూర్చుకోవడం
- అప్పు , జామీను దొరకకపోవడం
- భర్త చనిపోతే అప్పుల భారం
- కుటుంబ బాధ్యతలు

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

- పునరావాసం పొందడంలో కఠిన నిబంధనలు
- బోర్లు వేసి బాగా నష్టపోవడం, అప్పుల పాలు కావడం
- మార్కెట్‌లో దళారులతో, మధ్యవర్తులతో, వ్యాపారస్తులతో లావాదేవీలు జరపడంలో ఇబ్బంది
- అదనపు బాధ్యతలు, అన్ని పనులు మహిళలే చేయాల్సి రావడం
- సేవల (ట్రాక్టర్, ఇతర పనిముట్లు) ధరల్లో దోపిడీ
- కూలీలు, ట్రాక్టర్లు రావడంలో వివక్ష, అదునులో రారు
- మార్కెట్ లో మహిళలకు కనీస వసతులు (మరుగు దొడ్లు) లేకపోవడం, లైంగిక వేధింపులు
- మహిళలు తెచ్చే ఉత్పత్తుల కొనుగోలులో వివక్ష, జాప్యం

**పరిష్కార మార్గాలు – కొన్ని ఆలోచనలు**

- ఇంటి దగ్గర నుండి వ్యవసాయ సామగ్రి పొలం వరకు తీసుకుపోవడంలో సమస్యలు తగ్గాలి. మహిళలకు పని భారం తగ్గేలా ఒక సహాయ వ్యవస్థ ఏర్పరచాలి
- కూలి తగ్గించడం, తక్కువ కూలి ఇవ్వడం, లైంగిక వేధింపులు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. తగినన్ని పని దినాలు దొరకడం లేదు. సన్న జీవాల మందలతో వేరే ఊర్లకు వెళ్ళడం కష్టం
- ఉమ్మడి కుటుంబంలో ఆస్తుల వాటా ఇవ్వకపోవడం వల్ల ఆదాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మ హత్యలు చేసుకోకుండా మహిళలకు, మహిళా రైతులకు భరోసా ఇవ్వాలి. మహిళల సమస్యలపై పనిచేసే సంస్థలతో కలసి పని చేసే అవకాశం వుండాలి.
- మార్కెటింగ్‌లో సమస్యలను నివారించాలి. కొనుగోలు ధరలలో వివక్ష, సేవలలో దోపిడిని అరికట్టాలి. మార్కెట్‌లో మహిళలకు తగిన పనులు కల్పించాలి. లైంగిక దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి.
- ఎఫ్‌పిఓ ద్వారా అందే సేవల్లో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**పల్లె జీవం కార్యక్రమం:**

పల్లె జీవం కార్యక్రమం ద్వారా ముఖ్యంగా 'ఒంటరి మహిళలు, మహిళా యాజమాన్య కుటుంబాలు, నిరాశా



నిస్పృహలకు గురి అయిన మహిళలు, వారి జీవనోపాదులను పెంచడం, సుస్థిరం చేయడం, మెరుగు పరచడం ముఖ్య ఉద్దేశం.

- నిర్ణయాధికారం పెంచడం
- ఇతర ఆదాయ మార్గాలు పెంచడం
- చిన్న, సన్న జీవాల వైపు మొగ్గు చూపేలా చేయడం, ఉమ్మడి వనరులను అభివృద్ధి చేయడం
- ఉన్న ఆస్తుల రక్షణ , నైపుణ్యాల పెంపుదల
- మహిళలకు శ్రమ భారం తగ్గించడం
- ఎఫ్‌పి ఓ లో ఒక మహిళా విభాగం ఏర్పరచడం
- విత్తనాలను, ఎరువులను అదునులో గ్రామ స్థాయిలో అందుబాటులో వుంచడం
- మహిళలను సీఆర్‌పి లుగా తీసుకోవడం, వారిలో నైపుణ్యం పెంచడం
- సామర్థ్యాలు, అవకాశాలను గుర్తించడం
- పౌష్టిక ఆహార లభ్యత పెంచడం
- మహిళల సమస్యలు చెప్పుకోవటానికి ఒక ఫోరం ఎర్పాటుచేయడం. తద్వారా వివక్షను తగ్గించవచ్చు.
- ఉన్న ఆదాయ వనరులలో నికర ఆదాయం పెరగాలి
- ఒకటికి మించి ఆదాయ మార్గాలు వుండాలి
- ఉత్పత్తి వ్యవస్థలను, వనరులను మహిళలకు అందుబాటులోకి తేవాలి
- మహిళలకు ఆదాయాన్నిచ్చే ఉత్పతుల ద్వారా, ఆస్తుల ద్వారా ఆదాయాన్ని పెంచాలి

■

# విత్తన వ్యాపారంలో మహిళా డైరెక్టర్ల విజయం!

– సుభాషిణి

**క**రువును తట్టుకొని, వున్న వనరులను రక్షించుకుంటూ సొంత గ్రామంలోనే జీవనోపాధిని పెంపొందించుకోవాలి అనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పల్లె జీవం' పథకాన్ని ప్రారంభించింది. 'అన్నదాత' ఎఫ్ ఏ అనంతపురం జిల్లా గాండ్లపెంట మండలం లోని వేపరాళ్ల, మల్లమీదపల్లి, సోమయాజులపల్లి పంచాయతీలలో నివసిస్తున్న రైతులకు ఈ పథకాన్ని గురించి వివరిస్తూ, ప్రస్తుతం మనం వ్యవసాయంలో పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి అని చర్చించగా వ్యవసాయానికి అతి ముఖ్యమైన వర్షం, విత్తనం కొరత అని తెలిపారు. రైతులు సంఘటితమై ఒక సంఘంగా ఏర్పడితే ఈ సమస్యలను అదిగమించవచ్చునని సలహా ఇవ్వగా, మూడు పంచాయతీల లోని రైతులు ఒక్కొక్కరు రూ.1110 చొప్పున సభ్యత్వ రుసుం చెల్లించి 2018 మే నాటికి 100 మంది సభ్యులతో 'భూలక్ష్మి వ్యవసాయ రైతుల పరస్పర సహాయ సహకార సంఘం' పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 13 మంది (పురుషులు 7, స్త్రీలు 6) సభ్యులతో పాలక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మ్యాక్స్ చట్టం-1995 క్రింద తమ సంఘాన్ని నమోదు చేయించుకున్నారు.

ఈ పాలక వర్గం వారు ప్రతినెల పదవ తారీఖున సమావేశము నిర్వహించి జరిగిన పనులను సమీక్షించి, జరగబోయే పనులను నిర్ణయించుకొని, వాటిలో ఎదురయ్యే సాధకబాధకాలను గురించి చర్చించుకుని, పరిష్కార మార్గాలను కనుగొంటారు. ఈ చర్చలలో భాగంగా 2019 ఖరీఫ్‌లో తమ సంఘం తరపున విత్తన వేరుశనగ కాయలు కొని పంపిణీ చేద్దామని సభ్యులు తీర్మానించగా సంఘంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని పదాధికారులు మల్లేశ్వరమ్మ గారు, గోపాలమ్మ గారు, రమణమ్మ గారు ముందుకు వచ్చారు.

*'అన్నదాత' ఎ ఫ్. ఏ (ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ) అనంతపురం జిల్లాలోని గాండ్లపెంట, ఓబుల దేవర చెరువు, పరిగి మండాలలో వ్యవసాయం చిన్న జీవాలు, రైతు సంఘాలు, యన్.ఆర్.యం, మహిళా భాగస్వామ్యం అనే అంశాల మీద పని చేస్తున్నది.*



విత్తనం తేవాలని సభ్యులు లెక్కలు వేయగా తమ సంఘంలో ఉన్న వాటా ధనం రూ 2,50,000/- మాత్రమే కానీ సంఘం లోని సభ్యులందరికీ విత్తనాలు పంపిణీ చేయడానికి రూ. 5,00,000/-లు అవసరమవుతాయని తేలింది. ఈ అయోమయ పరిస్థితి నుంచి బయట పడడానికి వారు ఒక పరిష్కార మార్గాన్ని వెదికారు.

ఏప్రిల్ నెలలో నిర్వహించినటువంటి ఫీల్డ్ డే కి వాసన్ ప్రతినిధి రవీంద్ర గారు, డి.పి.యం.యు నుండి కృష్ణమూర్తి గారు, వ్యవసాయ అధికారి షాదాబ్ గారు,యల్.యఫ్.ఏ (లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ) ఏపిమాస్ నుండి జయరాం గారు, సంస్థాగత వ్యవస్థాపకులు రమేష్ రెడ్డి గారు హాజరు అయ్యారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు తమకు ఉన్నటువంటి విత్తన కొనుగోలు సమస్యను, వారి ప్రణాళికను వీరి ముందు ఉంచారు. దీనికి రవీంద్ర గారు యస్.పి.యం.యు వారితో మాట్లాడి రూ.5,00,000 రూపాయల వరకు నిధులు మంజూరు

**నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు**





చేయించగలనని హామీ ఇచ్చారు. సభ్యులు ముందుగా తమ వద్ద ఉన్న 2.50 లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి విత్తన వేరుశనగ కాయలు సేకరించడం మొదలు పెట్టారు. ఈ



తరుణంలో డి.పి.యం.యు వారు ఐదు లక్షల రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చారు. సంస్థ మూలధనం నుంచి తీసుకున్న రూ 2,50,000రూపాయలను తిరిగి ఆ ఖాతాకు జమచేసి 5,00,000రూపాయలతో 378 క్వింటాళ్ళ విత్తన వేరుశనగ కాయలు సేకరించి సంఘంలోని 320 మంది రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాగలిగారు.

ఈ వ్యాపార లావాదేవీలను మొత్తం కేవలం ఇద్దరు



మహిళలు మల్లేశ్వరమ్మ గారు, గోపాలమ్మ గారు చేశారు. నాణ్యమైన విత్తనాన్ని సేకరించడంలో, తూకము వేయడంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొని తాము కూడా మగవారితో సమానంగా వ్యాపారం చేయగలమని, నాణ్యమైన విత్తనాన్ని సరియైన సమయానికి అందించగలమని రుజువు చేశారు.

ఈ ఖరీఫ్ లో ప్రభుత్వ విత్తన పంపిణీలో సైతం చాలా ఆలశ్యం జరగడం, అందరికి అందించలేక పోవడంతో రైతులు ఇబ్బందులపాలు కాగా. 'భూలక్ష్మి వ్యవసాయ రైతుల పరస్పర సహాయ సహకార సంఘం'నాణ్యమైన విత్తనాన్ని తమకు సరైన సమయానికి అందించి పంటలు వేసుకొనేందుకు సహాయ పడినందుకు రైతులందరూ చాలా సంతోషం వ్యక్తం చేశారు. సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా సభ్య రైతులకు నాణ్యమైన విత్తనం అందించడంతో పాటు సంఘానికి దాదాపు 20,000 రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోగలిగారు. ■

## పెళ్ళికాని యువతికి తండ్రి నుంచి జీవనభృతి

**అ**వివాహితులైన 18 యేళ్ళలోపు యువతులకు తండ్రి నుంచి జీవనభృతి పొందే హక్కుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. తండ్రిని విడిచి జీవిస్తున్న 18 యేళ్ల యువతి పెళ్ళికాని తనకు జీవనాంశం ఇచ్చేలా తండ్రికి ఉత్తర్వులు జారీ చేయాలని వేసిన పిటిషన్‌పై కుటుంబ సంక్షేమ కోర్టు తీర్పుపై హైకోర్టులో వేసిన అప్పీలు పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఈ మేరకు తీర్పు చెప్పారు.

**ఇతరుల కష్టసుఖాలలో నీవు తోడుగా నిలిస్తే నీ కష్టసుఖాలలో వారు నీకు తోడుగా నిలుస్తారు**

# గ్రామ స్థాయిలో సైలేజ్ తయారీ విధానం

– విజయ్‌కుమార్ నాయక్

**భూ**మిలో గుంతను త్రవ్వి దానిలో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోనే పద్ధతిని "సైలేజ్" పద్ధతి అంటారు. ఈ పద్ధతిలో పచ్చిగా వుండే పశుగ్రాసాన్ని ముక్కలుగా చేసి, గాలి లేకుండా పులియబెట్టి, నీరు కూడా లేకుండా వుండే స్థితిలో నిలువ చేస్తారు. సైలేజి నాణ్యత గడ్డిలోని ఎండు పదార్థం, కరిగించబడే తీపి పదార్థాలపై ఆధారపడి వుంటుంది. మొక్కజొన్న, జొన్న, సజ్జ, మొదలైన పంటలను పాలు పోసుకొనే (విత్తనాలు ఏర్పడే) దశలో కోసి సైలేజికి ఉపయోగించాలి. నేపియర్ గడ్డి అయితే 45–50 రోజుల వ్యవధిలో కోసి సైలేజికి ఉపయోగించాలి.

పెద్దపల్లి గ్రామంలో నివాసం వుంటున్న పాడి రైతులైన చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుధాకర్, పురుషోత్తం రెడ్డి, సుజాత, మరికొంత మంది గ్రామస్తులు నాబార్డు ఆర్థిక సహాయంతో, గ్రామస్తుల తోడ్పాటుతో పల్లె జీవం కార్యక్రమంలో పని చేస్తున్న పశుగణాభివృది సహాయకుడు పి. విజయ్ కుమార్ సలహా, సూచనల మేరకు సైలేజ్ తయారు చేసుకున్నారు.

**పశుగ్రాస పంటల సాగులో గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయాలు :**



1. గడ్డిజాతి పశుగ్రాస విత్తనాలు పరిమాణంలో చాలా చిన్నవిగా ఉంటాయి. కావున వాటిని విత్తినపుడు లోతు 2 సెం. మీ. కంటే ఎక్కువ లేకుండా జాగ్రత్త వహించాలి.
2. నాణ్యత గల అధిక పచ్చిమేత దిగుబడిని పొందాలంటే పశుగ్రాస పంటల్ని 50% పూత దశలో కోయాలి.
3. పశువుల మేతలో మూడు వంతులు గడ్డిజాతి పశు గ్రాసంతో పాటు ఒక వంతు పప్పుజాతి పశుగ్రాసాన్ని కలిపి మేపడం వల్ల అధిక పోషక విలువలున్న పచ్చిమేత లభిస్తుంది.



4. పశుగ్రాసాన్ని కోసిన తరువాత, చాఫ్ కట్టర్ (కత్తిరింపు యంత్రము) ద్వారా చిన్న ముక్కలుగా చేయడం వల్ల పశువులు తీసుకొనే ఆహార పరిమాణము పెరుగుతుంది, అంతే గాక పశుగ్రాస నష్టం తక్కువగా ఉంటుంది.

5. జొన్న పంటను పూత దశ తరువాత మాత్రమే పశుగ్రాసంగా ఉపయోగించాలి, లేకుంటే పశు వులకు నాము వ్యాధి సోకే

అవకాశముంది.

6. పొలం చుట్టూ పశుగ్రాస చెట్లయిన సుబాబుల్, అవిసె మొదలైనవి పెంచడం వల్ల వేసవి కాలంలో పశువుల మేతను సమృద్ధిగా అందించవచ్చు. ఇంతే కాకుండా మన పరిసరాలలో లభించే పశుగ్రాసపు విలువలున్న చెట్లు నల్లతుమ్మ, దేవకంచానము, దురుశేన్, ఇప్ప, రావి, మర్రిచెట్టు, మునగ, సీమచింత, నెవలి, గంగిరేగు వంటి చెట్లను ఉపయోగించుకొని వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించవచ్చు.

7. వేసవి కాలంలో సాగు చేసుకోవటానికి పశుగ్రాసపు సజ్జ అనువైన పంట. తక్కువ తడులతో త్వరగా పెరిగి మూడు కోతల్లో ఎకరాకు 30 టన్నుల దిగుబడినిస్తుంది.



## సైలేజీ తయారీ విధానం

ఊటలేని ఎత్తైన ప్రదేశంలో గుంతను తవ్వి, దాని అడుగు భాగాన, పక్కలకు సిమెంటు గోడలు కట్టాలి. దానిపై మందపాటి పాలిథిన్ షీట్ కప్పి చాఫ్ కట్టర్‌తో సన్నగా నరికిన మేతను గుంతలో నింపి, దానిపైన ట్రాక్టరు నడిపి గుంతలో గాలి లేకుండా చేయాలి. ప్రతి టన్ను గడ్డికి 2-3 కిలోల బెల్లపు మడ్డి, 1/2 కిలో యురియా, 2 కిలోల ఉప్పు కలపాలి. భూమికి 2-3 అడుగుల ఎత్తు వరకు నింపి, దానిపై మందపాటి పాలిథిన్ షీట్ పరచి మట్టి, పేడ మిశ్రమంతో పూత పూసి (అలికి) ఏ మాత్రం గాలి, వర్షపు నీరు పాతరలోకి పోకుండా జాగ్రత్త పడాలి. లేనిచో గాలి, నీరు సోకిన పాతరగడ్డి బూజుపట్టి చెడిపోతుంది. ఇలా నిలువ చేసిన గడ్డి ఆ తర్వాత రసాయనిక మార్పుకు గురవుతుంది.

మంచి మాగుడు గడ్డి : లేత పసుపు పచ్చ రంగులో మగ్గిన పండ్ల సువాసనతో తేమగా ఉంటుంది.

చెడిపోయిన మాగుడు గడ్డి : ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగుతో పులుపు వాసన కలిగి, బూజు పట్టినట్లు ఉంటుంది.

పాతర వేసిన గడ్డి రెండు మూడు నెలలకు మాగి కమ్మటి వాసన కలిగిన సైలేజిగా తయారవుతుంది. దీన్ని అవ సరాన్ని బట్టి ఎప్పుడైనా తీయ వచ్చు. అవసరం లేకుంటే 1-2 సంవత్సరాల వరకు చెడిపోకుండా సైలేజిని నిలువ ఉంచు కోవచ్చు.

సైలేజి గుంత తెరిస్తే తరువాత నెల రోజులలోపు వాడుకోవాలి. లేకుంటే ఆరిపోయి, చెడిపోతుంది. మొత్తం కుప్పనంతా ఒకసారి తీయకుండా ఒక ప్రక్క నుంచి బ్రెడ్ ముక్కల లాగా తీసి వాడుకోవాలి. అలవాటుపడే వరకు పశువులు సైలేజిని తినకపోవచ్చు.

పాలు పితికిన తర్వాత లేదా పాలు పిండడానికి నాలుగు గంటల ముందు సైలేజిని పశువులకు మేపాలి. లేకుంటే పాలకు సైలేజి వాసన వస్తుంది. పాడిపశువు ఒక్కొంటికి సుమారుగా 20 కిలోల సైలేజిని ఇతర ఎండుమేతతో కలిపి మేపాలి.

■

సమస్యలనుంచి పారిపోతుంటే ఏనాడూ గెలవలేవు , ఎదురు నిలిచి ఎదుర్కోవడమే విజయ రహస్యం !

# ఎఫ్ పి ఓ ల ద్వారా విత్తనాల వ్యాపారం

**- యస్. మధు**

ఆంధ్రప్రదేశ్ కరువు సంసిద్ధత పథకంలో భాగంగా ఎఫ్ పి ఓ లు ఏర్పాటయ్యాయి. ఏపిమాస్ ఎఫ్ ఏ పనిచేస్తున్న రోళ్ళ, అగళి, గుడిబండ మండలాలలో మండలానికి ఒకటి చొప్పున ఎఫ్ పి ఓ లను 2018 ఏప్రిల్‌లో ఏర్పాటుచేసి రిజిస్ట్రేసన్ చేశారు. ఈ రైతు సంఘాలకు ఎఫ్ ఏ, ఎల్ ఎఫ్ ఏ ల ఆధ్వర్యంలో దశలవారీగా శిక్షణ కార్యక్రమాలను ఏపిమాస్ ఏర్పాటు చేసి వారికి ఎఫ్ పి ఓ విధులు, బాధ్యతలు, ఎఫ్.పి.ఓ ల నిర్వహణ, వాటి సేవల గురించి అవగాహన కల్పించింది,

ప్రభుత్వంనుండి కూడా కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది, ఫర్నీచర్‌కు సంబంధించి ఆర్థికంగా తోడ్పాటు లభించడం వల్ల అనతి కాలంలోనే ఎఫ్ పి ఓ లు నిలదొక్కు కోగలిగాయి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన నవధాన్యాలు, చిరు ధాన్యాలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ముందుగానే ఎఫ్ పి ఓ లు వ్యాపార ప్రణాళికలను రూపొందించుకున్నాయి. రైతులకు అవసరమైన విత్తనం గురించి ఏప్రిల్ నెలలో ఒక సర్వే నిర్వహించి, విత్తనం అవసరమైన రైతుల దగ్గర నుంచి విత్తనాల పంపిణీ నిమిత్తం కొంత మొత్తం అడ్వాన్స్‌గా సేకరించారు. ఈ సమాచారాన్ని బట్టి మే మొదటి వారంలో రైతు సంఘం సభ్యులు, సిబ్బందితో ఏర్పాటైన నాణ్యత కమిటీ వివిధ విత్తన క్షేత్రాలను పరిశీలించి నాణ్యతను నిర్ధారించింది.

తరువాత మొలక శాతాన్ని పరీక్షించి మే 2వ వారంలో విత్తనాన్ని ఉమ్మడిగా కొనుగోలు చేసి ఏపిమాస్ ఆధ్వర్యంలో మూడు ఎఫ్ పి ఓ లకు వారి అవసరానికి కావలసినంత పంపిణీ చేసి, కొంతవరకు ధరను నియంత్రించగలిగారు. కొనుగోలు చేసిన ధాన్యాలను అన్ని రైతు సంఘం కార్యాలయాలలోను, గ్రామాలలోనూ ఉంచి విక్రయించారు.

మూడు ఎఫ్ పి ఓ లు సాగించిన విత్తనాల కొనుగోళ్ళు, అమ్మకం వివరాలను ఈ దిగువ పట్టికలో చూడవచ్చు.

| క్ర.సం | ఎఫ్‌పిఓ పేరు | విత్తనం రకం | కేజీలు | కొనుగోలు ధర | అమ్మకం | ఖర్చులు | నికర లాభం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీ లక్ష్మి నరసింహ స్వామి మాక్స్ లిమిటెడ్ | చిరు ధాన్యాలు | 1200 | 97600 | 84137 | 2000 | 5800 |
| | | నవ ధాన్య | 716 | 34090 | | | |
| 2 | శ్రీ ఆంజనేయ స్వామి మాక్స్ లిమిటెడ్ | చిరు ధాన్యాలు | 1200 | 97600 | 54586 | 2300 | 4600 |
| | | నవ ధాన్య | 572 | 28340 | | | |
| 3 | శ్రీ ఆంజనేయ స్వామి మాక్స్ లిమిటెడ్ | చిరు ధాన్యాలు | 1200 | 97600 | 79520 | 5712 | 1500 |
| | | నవ ధాన్య | 543 | 29905 | | | |

పై పట్టికలో పేర్కొన్న విధంగా 40 రోజులలో 93% విత్తనాన్ని ఏపిడిఎంపి ప్రాజెక్ట్ పరిధిలోని రైతులకు విక్రయించారు. విత్తనం ధర కూడా మార్కెట్ ధర కంటే తక్కువగా ఉంచారు. దీని ద్వారా ప్రతి ఎఫ్ పి ఓ కొంత ఆదాయన్ని ఆర్జించగలిగింది.

**ఎఫ్ పి ఓ ద్వారా రైతులకు అందిన ప్రయోజనాలు**

1. విత్తే సమయానికి ముందే విత్తనం అందుబాటులో ఉంచడం
2. నాణ్యమైన విత్తనాన్ని అందుబాటులో ఉంచడం
3. రైతుల శ్రమను, ఖర్చును తగ్గించడం

**నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారో కాదో ఆలోచించుకో**







**విత్తనం వ్యాపారంతో ఎఫ్ పి ఓ పొందే ప్రయోజనాలు :**

1. ఎఫ్‌పిఓ వ్యాపార సంస్థగా రూపొందడం
2. ఆర్థిక స్వావలంబన సాధనకు కృషిచేయడం
3. రైతులకు ఆసరాగా నిలవడం

**వ్యాపారంలో రాజీలేని సూత్రాలు**

- బి ఓ డి సభ్యులు అన్ని దశలలో పాలుపంచుకోవడం
- ఎఫ్‌పిఓ ఉపసంఘాలు నిర్మాణాత్మకంగా పనిచేయడం
- నాణ్యతలో రాజీపడకుండడం
- అప్పు ఇవ్వకుండా కేవలం నగదు లావాదేవీలనే నిర్వహించడం
- మధ్యవర్తులు, దళారీలు లేకుండా చూడడం
- విత్తనంకొన్న ప్రతి రైతుకు రసీదులు ఇవ్వడం
- పుస్తకాల నిర్వహణ, నమోదు.
- వ్యాపారంలో నష్టాలు రాకుండా జాగ్రత్త పడడం ■

# కొవ్వును కరిగించే అల్లం నీరు !

సాధారణంగా పొట్ట, పిరుదులు, తొడల్లోనే ఎక్కువగా కొవ్వు పేరుకుంటూ ఉంటుంది. ఈ కొవ్వును కరిగించడానికి పాటించే ఆహార నియమాల్లో అల్లం నీళ్లు కూడా చేర్చుకోవాలి.

అల్లం నీళ్లు శరీరంలోని విషాలను బయటకు వెళ్లగొట్టి మెటబాలిజంను పెంచుతాయి. అధిక కొలెస్ట్రాల్ కారణంగా తలెత్తే వ్యాధుల నుంచి కూడా రక్షణ దొరుకుతుంది. అలాగే రక్తపోటును నియంత్రణలో ఉంచి రక్తనాణాల్లో రక్తం గడ్డలు కట్టకుండా నియంత్రించే శక్తి అల్లం నీళ్లకు ఉంటుంది. రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, ఆర్థ్రయిటిస్ మొదలైన కీళ్ల నొప్పుల నుంచి రక్షణ అందిస్తాయి. కొన్ని రకాల కేన్సర్లు రాకుండా చేయడంలో కూడా అల్లం నీళ్లు అద్భుతంగా పని చేస్తాయి. ఈ పానీయం ఎలా తయారు చేయాలంటే....



**కావలసిన పదార్థాలు:**

100 గ్రాముల అల్లం సన్నగా తరగాలి
5 లీటర్ల నీళ్ళు,
నిమ్మరసం కొద్దిగా.

తయారీ ఇలా:

నీళ్లలో అల్లం ముక్కలు వేసి మరిగించి 15 నిమిషాలపాటు చిన్న మంట మీద ఉంచాలి. తర్వాత చల్లార్చి వడగట్టి, నిమ్మరసం కలుపుకోవాలి. ఈ పానీయాన్ని కప్పు పరిమాణంలో ప్రతి రోజూ ఉదయం అల్పాహారానికి ముందు రాత్రి భోజనానికి ముందు తాగుతూ ఉండాలి. ■

పరస్పరం నమ్మకం అనుబంధానికి బలం, వారికోసం అవసరమైతే రాజీపడడం ఆ బంధానికి శాశ్వతత్వం

# వర్షానికి ముందే వట్టి దుక్కిలో విత్తడం !

– నాగేష్ గౌడ్

**అ**దునుకు అనుగుణంగా వట్టి దుక్కిలో వర్షం రావడానికి ముందే విత్తుకుంటే, తర్వాత వచ్చే వర్షాలకు ఆ విత్తనం మొలకెత్తడానికి సిద్ధంగా ఉండడం ఈ పద్ధతిలోని ప్రత్యేకత. ఆముదాలగొంది గ్రామానికి చెందిన శ్రీ లోకేష్ అనే రైతుకు 5 ఎకరాల పొలం ఉన్నది. గతంలో 4 బోర్లు వేసినా,కరువు



కారణంగా అన్నిటిలో నీరు అడుగంటింది. ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఉన్న లోకేష్‌కు 'పల్లెజీవం' కార్యక్రమంలోని సంసిద్ధతా పథకంలో భాగంగా 'వట్టి దుక్కిలో విత్తడం' అనే పద్ధతిని జనజాగృతి సంస్థ అధికారిగా నేను సూచించాను. నా సూచనను పాటించడానికి అంగీకరించిన లోకేష్ అర ఎకరం పొలాన్ని వేసవి దుక్కులు దున్నుకొని విత్తడానికి అనువుగా సిద్ధం చేసుకున్నాడు. జూన్ 5 వ తారీకున మా



సంస్థ మార్గదర్శకత్వంలో ఈ పొలంలో లోకేష్ వేరుశెనగ విత్తనం విత్తాడు. వాన తేమను మట్టిలో పట్టి ఉంచడంకోసం మా సూచన మేరకు ఆఖరి దుక్కిలో ఘనజీవామృతాన్ని చల్లాడు. ఈ ఘనజీవామృతం గాలిలోని తేమను విత్తనానికి అందిచడం కొసమెరుపు.

విత్తిన తర్వాత ఆచ్ఛాదనగా ఎండుటాకులను, వేరుశెనగ పొట్టును చల్లాము. ఈ ఆచ్ఛాదన పదార్థం వలన భూమిలోని తేమ ఆవిరి కాకుండా నివారించబడడంతో పాటు, చివరకు అది సేంద్రియ ఎరువుగా కుళ్ళి మొక్కకు పోషకాహారంగా మారుతుంది. విత్తనం నాటిన 20 రోజులు తర్వాత పడిన వర్షానికి వంద శాతం మొలకెత్తింది. మొలక ఆరోగ్యంగా పెరుగుతున్నది. ఎటువంటి రసాయనిక ఎరువులు వేయ



కుండా, విత్తిన రోజు నుండి ప్రతి 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతాన్ని పిచికారీ చేస్తున్నాడు. వర్షం తర్వాత విత్తిన మాదిరిగానే ఈ వట్టి దుక్కి విత్తే పద్ధతిలో పంట ఏపుగా పెరగడం లోకేష్‌కు ఈ పద్ధతిపట్ల నమ్మకాన్ని పెంచింది, ఇకపై మొత్తం పొలంలో ఈ విధానంలో పంట వేయాలని లోకేష్ ఆసక్తిగా వున్నాడు. ఈ విధానానికి జడ్ బి ఎన్ ఎఫ్ వారు కూడా తమ సహకారాన్ని అందించారు. ఈ పంటను చూసిన ఆ గ్రామ రైతులు తాము కూడా ఈ పద్ధతిని పాటించాలన్న ఆసక్తిని వ్యక్తం చేశారు. ■

నీవు ఎవరి మనసైనా నొప్పిస్తే వారి మన్నన కోరు, నిన్నెవరైనా నొప్పిస్తే వారిని మన్నించు

# ఎఫ్ పి ఓల రేటింగ్‌కు అనుసరించే విధానం !

– సుభాషిణి

రైతులకు కరువును తట్టుకొని జీవనోపాధి కొనసాగించ గలననే ధైర్యాన్ని, అవకాశాన్ని కల్పించడంకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పల్లె జీవం' పథకాన్ని ప్రారంభించింది. అనంతపురం జిల్లాలో గాండ్ల పెంట, ఓ.డీ.సీ, పరిగి మండలాలలో ఒక్కొక్క మండలంలో మూడు పంచాయితీలలో ఈ పథకం అమలు అవుతున్నది.

ఈ మూడు మండలాలలో తొమ్మిది పంచాయితీలలో పల్లె జీవం పథకం నిర్వహణను 'అన్నదాత ' సంస్థ చేపట్టింది. ఇందులో భాగంగా, రైతులలో కొన్ని కరువును తట్టుకొనే ఆలోచనలు కలిగించాలి, పండించే పంటలను దళారులకు అమ్మి నష్టపోకుండా వారే సొంతంగా వ్యాపార ప్రణాళికలు చేసుకుని అమ్ముకునేలా వారికి అవగాహన కల్పించాలని అన్నదాత సంకల్పించింది. రైతులును సంఘటిత పరచి, మ్యాక్స్ సహకార చట్టం–1995 క్రింద 'భూలక్ష్మి వ్యవసాయ రైతుల పరస్పర సహాయ సహకార సంఘం' (350 మంది రైతులు), 'సోమావతి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం' (348మంది రైతులు), 'సంగమేశ్వర ఎఫ్ పి ఓ' (180 మంది రైతులు) ఏర్పాటు చేసి ఈ సభ్యులు నుండి మూడు మండలాలలో ఒక్కో సంఘానికి 13 మంది చొప్పున పాలకవర్గ సభ్యులును ఏర్పాటు చేయడం జరిగింది.

వీరు ప్రతి నెల సమావేశాలకు హాజరై, వారు ఏఏ కార్య క్రమాలు చేశారో, ఇక ఏ కార్యక్రమాలు చేయాలో ప్రణాళిక లను సిద్ధం చేసుకొని ఆ ప్రకారం ఆమలు చేస్తుంటారు. అయితే, ఈ సంఘాల పని తీరు అంచనా వేయడానికి క్రింది అంశాలను ఆధారంగా చేసుకొని మూడు ఎఫ్ పి ఓలకు రేటింగ్ ఇవ్వడం జరిగింది.



**ఎఫ్ పి ఓ ప్రామాణికాలు**

- పాలకవర్గ సభ్యుల సఖ్యత, వాస్తవిక దృక్పథం, చేపట్టిన కార్యకలాపాలు
- పాలక వర్గ సభ్యుల బాధ్యతలు
- పాలకవర్గ సభ్యుల నిర్ణయాధికారం
- పాలకవర్గ సభ్యులలో మహిళల శాతం (50%)
- పదాధికారులలో మహిళల నిర్ణయాల అమలు
- నెల సమావేశాలకు పాలకవర్గ సభ్యుల హాజరు శాతం
- సంఘంలో సభ్యుల చేరిక (షేర్ క్యాపిటల్)
- సంఘం పుస్తక నిర్వహణ
- సంఘం ఆశయం, లక్ష్యం
- సంఘం వ్యాపార లావాదేవీలు, వ్యాపార ప్రణాళికలు
- ఇతర కార్యక్రమాలలో పాలకవర్గ సభ్యుల భాగస్వామ్యం
- వనరులను వినియోగించే విధానం

పై ప్రామాణికాల ఆధారంగా ఎఫ్‌పిఓ లకు రేటింగ్ ఇవ్వడం జరుగుతుంది. 91–100 మార్కులు వస్తే 'ఏ' గ్రేడ్, 71 – 90 మార్క్ లు వస్తే 'బి' గ్రేడ్, 70 మార్క్‌ల కంటే తక్కువ వస్తే 'సి' గ్రేడ్ వస్తుంది. ఈ రేటింగ్ ప్రకారం భూలక్ష్మి ఎఫ్ పి ఓ కి 80 మార్కులు, కావున 'బి' గ్రేడ్; సోమావతి ఎఫ్ పి ఓ కి 78 మార్కులు, కావున 'బి' గ్రేడ్, సంగమేశ్వర ఎఫ్‌పిఓ కి 74 మార్కులు, కావున 'బి' గ్రేడ్ ఇవ్వడం జరిగింది. ఈవిధంగా ర్యాంకింగ్ ఇవ్వడం ద్వారా ఎఫ్.పి.ఓలు ఎక్కడ వెనుకబడి ఉన్నాయో తెలుసుకొని వారికి శిక్షణలు ఇచ్చి బలోపేతం చేయడానికి ఇది ఒక మంచి సాధనం. ■


పదిమందిని బాధపెట్టి పైకెదగడం గొప్పకాదు, పదుగురికి తోడ్పడుతూ ఎదగడమే గొప్ప

# నవధాన్య పద్ధతి సాగుపై రైతులకు అవగాహన !

యస్. మధు

వ్యవసాయ పద్ధతులలో, పంటల రకాలలో సమగ్రమైన మార్పులను తీసుకొని వచ్చి, మరింత లాభసాటియైన, నాణ్యమైన పంటలతో కరువు ప్రాంత రైతులకు భరోసా కల్పించాలన్న పల్లె జీవం కార్యక్రమ లక్ష్యానికి అనుగుణంగా, నవధాన్య పద్ధతిని రైతులకు క్షేత్ర ప్రదర్శన ద్వారా వివరిస్తారు. రోళ్ళ మండలం మణిపురం గ్రామంలోని రామన్న అనే రైతు పొలంలో నవధాన్య పద్ధతిపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించాము. ఈ కార్యక్రమంలో ఇతర రైతులను కూడా ఆహ్వానించి వాళ్ళకు అర్థం అయ్యే రీతిలో ప్రత్యక్షంగా నవధాన్య పద్ధతిలో విత్తడం ద్వారా వారి పొలాలలో ఈ పద్ధతిని పాటించడానికి అవగాహన కల్పించాము.





**నవధాన్య పద్ధతి అంటే ...**

నవధాన్య పద్ధతి అనగా 9 కాలాల పాటు 9 కార్తెల పొడవునా రైతు పొలం పచ్చగా ఉండడం అని అర్థం. అదే విధంగా ఎండాకాలం వరకు భూమిని కప్పి ఉంచడం ద్వారా మట్టిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండే విధంగా చూడడం, భూసారం కొట్టుకు పోకుండా నిరోధించడం ఇందులో భాగం.

**నవధాన్య పద్ధతి ఉద్దేశాలు :**

విత్తిన 40 రోజుల నుండి 240 రోజుల పాటు దశల వారీగా పంట చేతికి రావడం, ఒక పంట చీడ పీడల బారిన పడితే ఇంకొక పంట చేతికి అందడం అనేవి నవధాన్య పద్ధతిలోని ప్రధాన ఆశయాలు.

**విత్తే విధానం**

నవధాన్య పద్ధతిలో పంటలను ప్రధానంగా అంతర పంటలు, మేరపంటలు, ఎర పంటలుగా విభజించి చూడ వచ్చు. సంప్రదాయ వ్యవసాయంలో పంటల పెరుగుదల, మొక్క విస్తరించే విధానం, ఎత్తు, పంట కాల పరిమితి మొదలగు అంశాలను పరిగణలోనికి తీసుకొని విత్తడం లేదు.

ఇప్పుడు నవధాన్య పద్ధతిలో పై అంశాలను కచ్చితంగా పాటిస్తూ విత్తడం ముఖ్యాంశం. మొట్టమొదట మేర పంటలుగా జొన్న, సజ్జ కలిపి గాని, వేరువేరుగా గాని 3–6 చాళ్ళు విత్తుకోవాలి. తరువాత ప్రధానపంట 8 చాళ్ళు విత్తుకోవాలి. 9 వ చాలులో కంది, అలసంద, ఆముదం తగిన మోతాదులో విత్తుకోవాలి. తరువాత 8 చాళ్ళు ప్రధాన పంట, 9వ చాలు కంది, పెసర, ఆముదం విత్తుకోవాలి. తరువాత 8 చాళ్ళు ప్రధాన పంట 9వ చాలు అనుములు విత్తుకోవాలి, 8చాళ్ళ ప్రధాన పంట తరువాత 9వ చాలు ఆముదం విత్తాలి. ప్రధాన పంటలో కూడా అక్కడక్కడ ఎరపంటగా చాలా తక్కువ మోతాదులో ఆముదం కలిపి విత్తడం వల్ల ఇవి పక్షి స్థావరాలుగా ఉపయోగపడి చీడపీడలను నియంత్రించడానికి దోహద పడతాయి. అక్కడక్కడ నువ్వులు, బీర, కాకర వంటి కూరగాయల పంటలు వేసుకోవచ్చు. ఈ పద్ధతిని ప్రత్యక్షంగా విత్తి చూపడం ద్వారా ఈ సంవత్సరంలో ఒక్కొక్క ఎఫ్ పి ఓ పరిధిలో దాదాపు 400 ఎకరాలలో నవధాన్య పద్ధతిని విస్తరించడానికి ప్రణాళిక రూపొందింది.

ఇదేవిధంగా అగ్రహారం గ్రామంలో గిరియప్ప అనే రైతు పొలం లోనూ, గుడిబండ మండలం సిసి గిరి లో పుట్టన్న అనే రైతు పొలంలోను నవధాన్య పద్ధతిని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించడం జరిగింది. ■

ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు

# 'పల్లె జీవం'లో చిన్నజీవాల బడి కార్యక్రమం

- వి. నారాయణస్వామి

పల్లె జీవం (ఏ పి డి ఎం పి) లో భాగంగా ఏపిమాస్ ఆధ్వర్యంలో అగలి, గుడిబండ, రోళ్ళ మండలాలలో పల్లె జీవం ప్రాజెక్ట్ ద్వారా ప్రతి మండలంలో మూడు గ్రామ పంచాయతీలలో సన్నజీవాల బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతి నుండి ఒక పారా వర్కర్‌ను ఎన్నుకొని వారికి శిక్షణ ఇచ్చి పశు సంవర్ధక శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

దేశంలో తీవ్రమైన వాతావరణ మార్పులకు లోనయ్యే ప్రాంతాల్లో అనంతపురం జిల్లా ఒకటి. ఈ జిల్లాలో వర్షపాతం తక్కువ. తరచుగా కరువు పరిస్థితులు తలెత్తుతున్నాయి. సాగు నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉంటాయి

సన్నజీవాల ఉత్పాదకతను మెరుగుపరచడం, కరువు పరిస్థితులను తట్టుకో గలిగే గొర్రెలు, మేకల వంటి సన్నజీవాల పెంపకంతో పాటు అదనపు ఆదాయం కోసం ప్రోత్సహించేలా పల్లెజీవం పథకం దృష్టి కేంద్రీకరిస్తుంది. పశుసంవర్ధక శాఖ ద్వారా అందే సేవలను మరింత బలోపేతం చేయడం, సేవల లోపాలను తగ్గించడం కూడా ఈ కార్యక్రమంలోని ప్రధాన అంశాలే.

పారా వర్కర్స్ ద్వారా కమ్యూనిటీ స్థాయి ఆరోగ్య కార్యకర్తల, ఉత్పత్తిదారుల సామర్థ్యాలను పెంచడానికి ఈ మూడు మండలాలలో 44 పశు పాఠశాలలను నిర్వహించారు. ఒక్కొక్క గ్రూప్‌లో కనీసం 15-20 మంది గొర్రెల కాపరులు సభ్యులుగా సంఘాలను ఏర్పాటు చేసి, పశు పాఠశాలలను నిర్వహించి 720 మంది రైతులకు అవగాహన కల్పించాము. సన్నజీవాల పెంపకందారులకు, గొర్రెల కాపరులకు పారా వర్కర్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ప్రత్యేకమైన శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తల (పారా వర్కర్స్) ద్వారా పశు పాఠశాలలో శిక్షణ యిస్తారు. ఈ 3 మండలలాల్లో 9 మంది పారా వర్కర్స్ ఉన్నారు. వీరిలో ముగ్గురు మగవారు, ఆరుమంది మహిళలు.

సన్నజీవాల ఉత్పత్తి వ్యవస్థలను మెరుగుపరచడంలో భాగంగా పల్లెజీవంలో ఈ క్రింద తెలిపిన పనులు కూడా చేపడతారు.

1. టీకాల పంపిణీ
2. గొర్రెపిల్లల మరణాలను తగ్గించడానికి రాత్రికొట్టాల ఏర్పాటు
3. ఎంపిక చేసిన బ్రీడర్ల ద్వారా నాణ్యమైన గొర్రెపిల్లల ఉత్పత్తి. ఒకే మంద లోపల పునరుత్పత్తి నిరోధించడానికి పొట్టేళ్ళ మార్పిడికి ప్రోత్సాహం



4. ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల అందుబాటు ద్వారా జీవాలలో రోగాల, మరణాల శాతం తగ్గించడం
5. మంద స్థాయిలో అదనపు దాణా ఇచ్చే అలవాటును ప్రోత్సహించటం, పోషకాహార దాణా వ్యవస్థల బలోపేతం
6. జీవాలకు మేత, ఆహార భద్రత ప్రణాళికలను అమలు చేయడం ద్వారా వలసల నివారణ
7. మందలలో మేలు జాతి పొట్టేళ్ళను ప్రవేశ పెట్టడం, మేలు జాతి ఉత్పత్తిని ప్రోత్సహించడం
8. బ్రీడింగ్ పొట్టేళ్ళ మార్పిడికి ప్రోత్సాహం, మంద లోపల బ్రీడింగ్‌ను తగ్గించడం
9. రైతు సంఘం స్థాయిలో మార్కెటింగ్ వ్యూహాలు

■

దానం సంపాదనను శుద్ధి చేస్తుంది, క్షమాగుణం సంబంధాలను వృద్ధిచేస్తుంది

# చిన్నజీవాలకు మెరుగైన యాజమాన్య పద్ధతులు !

– శ్రీనివాస్

అనంతపురం జిల్లాలో ముఖ్య వృత్తి వ్యవసాయం అయినప్పటికి, కొన్ని సంవత్సరాలుగా సరైన సమయంలో వర్షాలు పడక వ్యవసాయం కుంటుపడుతున్నది. అందువల్ల ఈ జిల్లా రైతులు రెండవ ఉపాధిగా సన్న జీవాల పెంపకంపట్ల ఆసక్తి చూపుతున్నారు.

ఈ సన్న జీవాల పెంపకంలో సరైన అవగాహన లేక పెంపకందారులు నష్టాలకు గురి అవుతున్నారు. ఈ విషయాన్ని గమనించి ఈ జీవాల పెంపకందార్లకు తగిన అవగాహన కలిగించడానికి 'పల్లె జీవం' పథకం వారికి అండగా నిలుస్తున్నది. ఈ పథకం అమలు జరపడంలో భాగస్వామిగా వున్న 'అన్నదాత' ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ (ఎఫ్.ఏ) గాండ్ల పెంట, ఓ.డీ.సీ, పరిగి మండలాలలోని చిన్నజీవాల పెంపకం దార్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

అనాదిగా వస్తున్న జీవాల పోషణ విధానాన్ని మాత్రమే మొండిగా నమ్మకుండా ఆధునిక పోషణలో వచ్చిన మార్పులను అర్థం చేసుకుని, జీవాల పెంపకందారులు శాస్త్రీయ పద్ధతిలో జీవాల్ని పోషించాలి. అప్పుడే రాత్రనక పగలనక చేస్తున్న శ్రమకంటే తక్కువ శ్రమతో, తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పాదకత సాధించి లాభాలు ఆర్జించే అవకాశాలు ఉంటాయి. ఇందుకు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

**ముఖ్యమైన యాజమాన్య పద్ధతులు**

- పాకలను పరిశుభ్రంగా ఉంచడం
- చిన్నజీవాలకు క్రమం తప్పకుండా టీకాలను ఇప్పించడం

| వ.సం | వ్యాధి పేరు | ఏ నెల |
|---|---|---|
| 1 | పి.పి.ఆర్ | జనవరి |
| 2 | గాలి కుంటు వ్యాధి | మార్చి |
| 3 | చిటూక రోగము | మే |
| 4 | మశూచి / బొబ్బవ్యాధి | నవంబర్ |

ఇలా చేయడం ద్వారా 70 శాతం వ్యాధులు నివారించ బడతాయి. సకాలంలో వ్యాక్సినేషన్ ఇప్పిస్తూ విత్తన పొట్టేళ్ళు పెరగడంలో జాగ్రత్త వహించాలి. ఈ విత్తన పొట్టేళ్ళు మందలో సగమైనా ఉండాలి.



**విత్తన పొట్టేళ్ళు**

- చురుకు గా ఉండాలి
- బలిష్టంగా ఉండాలి
- అంగ వైకల్యం లేనివై ఉండాలి
- 24 నెలల వయస్సు కలిగి ఉండాలి
- ప్రతి 2 సంవత్సరాలకు విత్తన పొట్టేళ్ళను మార్చాలి

ఇలా చేయడం ద్వారా మంద 2 సంవత్సరాల కాలంలోనే 3 రెట్లు పెరుగుతుంది.

**లాభదాయకమైన గొర్రెల పెంపకానికి సూచనలు**

- గొర్రె పిల్లలకు సమృద్ధిగా జున్ను పాలు పట్టాలి
- 3 నెలల వయస్సు కలిగిన పిల్లలకు క్రమం తప్పక టీకాలు వేయించాలి.

పల్లెజీవం పనిచేస్తున్న 3 మండలాల్లో ఇప్పటివరకు 16,225 జీవాలకు టీకాలు వేయించడం, 1250 గొర్రెలకు లివర్ టానిక్ ఇప్పించడం జరిగింది. ■

**అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!**

# ఎఫ్ పి ఓ ల సేవలపై ముమ్మరంగా ప్రచారం !

– టి. ప్రభావతి

**అ**నంతపురం జిల్లా తలుపుల మండలంలో పల్లె జీవం కార్యక్రమంలో భాగంగా మూడు గ్రామ పంచాయతీలలో అనగా ఓబుల్‌రెడ్డిపల్లె, పులిగుండ్లపల్లె, పెన్నబడివాండ్ల పల్లె పంచాయతీలలోని రైతులు అందరూ కలసి ఒక వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాన్ని (ఎఫ్ పి ఓ ను) ఏర్పాటు చేసుకున్నారు. దీనికి ' జై వీరాంజనేయస్వామి రైతు సంఘము' అని పేరు పెట్టుకున్నారు. ఇందులో ఓబుల్‌రెడ్డిపల్లె, పులిగుండ్లపల్లె పెన్నబడివాండ్లపల్లె పంచాయతీలలోని రైతులు అందరూ భాగస్వాములు. ఇప్పటివరకు ఒక్కొక్కరు 1110/- రూ కట్టి 289 మంది సభ్యులుగా చేరడము జరిగింది.

ఈ ఎఫ్ పి ఓ లో రైతులకు కావలసిన సమాచారము రైతు సేవా కేంద్రం (క్లిక్ సెంటర్) ద్వారా అందించడము జరుగుతుంది. ఇందులో వర్షపాత వివరాలు, వాతావరణ



సూచనలు, పంటలకు సంబంధించిన వివరాలు, పంటలకు సంబంధించిన తెగుళ్ళ వివరాలు, మార్కెట్ సంబంధిత సమాచారాలు, భూగర్భ నీటిస్థితి గతులకు సంబంధించిన వివరాలు, రైతులకు కావలసిన విత్తనాల వివరాలు, వ్యవసాయ పరికరాలు, యంత్రాల అద్దె కేంద్రాల వివరాలు, కషాయాల కేంద్రము, పొలంబడి, సన్న జీవాలకు సేవలు, మహిళా రైతులు, ఒంటరి మహిళలకు కావలసిన సేవలన్నీ ఈ రైతు సంఘము అందిస్తుంది.

ఇందులో భాగంగానే ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావలసిన చిరుధాన్యాలు, నవధాన్య కిట్స్ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ రైతు సంఘంలోని పాలక వర్గ సభ్యులు, ఈ రైతు సంఘంలోని కొనుగోలు కమిటీ, నాణ్యతా కమిటీ, డిస్ట్రిబ్యూషన్ కమిటీ, కార్యనిర్వహణ కమిటీ



సభ్యులందరు ఈ బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ సభ్యులే విత్తనాలను (కొర్రలు, అండు కొర్రలు, సామలు) ప్యాకింగ్ చేసి రైతు సేవా కేంద్రంలో రైతులకు అందుబాటులో వుంచడం జరిగింది.

ఈ చిరుధాన్యాల ఆవశ్యకత గురించి గ్రామాలలో అవగాహన కలిగిస్తున్నారు. రైతు సంఘంలో అందుబాటులో వున్న ట్రాక్టర్ గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. రైతుల పొలాలను దున్నడానికి, ఇతర వ్యవసాయ పనుల కొరకు ఈ ట్రాక్టర్ అందుబాటులో వుంటుంది అని గ్రామాలలో ఊరేగింపుగా ప్రచారము చేశారు. ఈ విధంగా జై వీరాంజనేయస్వామి రైతు సంఘం మాస్, ఎఫ్.ఈ.ఎస్ సంస్థల సహకారంతో తమకు మేలైన సేవలను అందిస్తున్నదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



■

సామర్థ్యం విజయాన్ని అందిస్తుంది, చక్కని నడవడిక ఆ విజయానికి ఆయువు పెంచుతుంది

# దేశీ కోళ్ళ పెంపకం, వ్యాధుల నివారణ

– యన్. హరికృష్ణ

**క**రువు జిల్లా అయిన అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలో మారుమూలగా వున్న రోళ్ళ, అగళి, గుడిబండ మండలాలలో ఏ పి డి యం పి ప్రాజెక్ట్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఒక్కొక్క మండలంలో మూడు పంచాయతీల పరిధిలో గ్రామీణ జీవనోపాధులను ప్రోత్సహించడంలో భాగంగా పెరటి కోళ్ళ పెంపకానికి ప్రాధాన్యత యిస్తూ మండలానికి ఒక కోళ్ళ పెంపకం యూనిట్‌ను మంజూరు చేశారు. మూడు గ్రామపంచాయతీల పరిధిలో 100 కుటుంబాలకు 5 చొప్పున 40 రోజుల పిల్లలను మంజూరు చేస్తారు.



**పెరటి కోళ్ళ ప్రాధాన్యత :** ఈ పెరటికోళ్ళ పెంపకంతో కుటుంబ స్థాయిలో మాంసం, గుడ్ల వంటి ఆహార అవసరాల కోసమే కాకుండా, వాటిని అమ్మడం ద్వారా ఆయా కుటుంబాలు చెప్పుకోదగిన ఆదాయాన్ని పొందగలుగుతాయి. దేశీ కోళ్ళు ఆరుబయట తిరుగుతూ మేత మేస్తాయి. సహజంగా పొదుగుతూ సంతనోత్పత్తి చేస్తాయి. రోగాలను బాగా తట్టుకుంటాయి. సకాలంలో టీకాలు వేయించడం (వ్యాక్సిన్) వంటి పెరటి స్థాయిలో దేశీ కోళ్ళ పెంపకానికి సంబంధించిన పద్ధతులను చక్కగా పాటించడం ద్వారా గ్రామీణ కుటుంబాలు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునే అవకాశం ఉంది.

**పెరటి కోళ్ళ ఆరోగ్య సంరక్షణ సేవలు :** దేశీ లేదా నాటు కోళ్ళకు వ్యాధులు, రోగాల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది కాబట్టి వాటిని తట్టుకొనే రీతిలో అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉండడం చాలా అవసరం. సకాలంలో సేవలు అందడం కూడా చాలా ముఖ్యం. స్థానికంగా ఉండే యువత లేదా మహిళలకు 3–5 రోజులు శిక్షణ యిచ్చి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, ఈ సేవలు అందుబాటులోనికి తేవచ్చు. శిక్షణ ఇచ్చే సమయంలో పశు వైద్యాధికారి ఉండేలా చూడడం ముఖ్యం. కోళ్ళ పెంపకం దారులు తమ వాటాగా కొంత మొత్తం సమకూరుస్తూ గ్రామ స్థాయిలో కోళ్ళ నిధి ఏర్పాటు చేసుకొనవచ్చు. గ్రామంలోని 100 కుటుంబాలు కలిసి కోళ్ళ నిధిని ఏర్పాటు చేయవచ్చు. సభ్యత్వ రుసుం, ఇతర నిర్దిష్ట మొత్తాలను చెల్లిస్తూ ఈ నిధిని నిర్వహించుకోవచ్చు.దేశీ కోళ్ళకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించవచ్చు . కేవలం ఒక వ్యక్తి 50 మంది అంతకన్నా ఎక్కువ మంది కోళ్ళ పెంపకదార్లకు సేవలు అందించవచ్చు. ఈ సేవలకు ఉమ్మడి ప్రయోజనాల సేవల కింద కొంత అదనపు ఆదాయం కూడా లభిస్తుంది.

**పాటించవలసిన జాగ్రత్తలు :**

- కుటుంబ స్థాయిలో కోళ్ళ పెంపకానికి గాలి వెలుతురు సరిగ్గా ఉండి పరిశుభ్రంగా ఉండే వసతి అవసరం
- దేశీ కోళ్ళ పెంపకంలో వాటికి అందించే పోషణకు ప్రాధాన్యత వుంటుంది. చాలావరకు వాటకి పౌష్టికాహారం పెరట్లో ఆరుబయట ప్రాంతాలలోనే దొరుకుతుంది. వేసవి కాలంలో ఆరు బయలు ప్రాంతాలలో ఆహారం సరిగా లభించదు కాబట్టి చిరుధాన్యాల పొట్టును వాటికి ఆహారంగా ఇవ్వవచ్చు. పొట్టు, తవుడు, అజొల్ల వంటివి అందిస్తే వాటికి ప్రోటీన్లు అందుతాయి. గుడ్డు పెంకు

**ఆలోచనలు మారవచ్చు కాని సిద్ధాంతం కాదు, ఆకులు రాలవచ్చు కాని మూలం నశించకూడదు**



నిర్మాణానికి కాల్షియం అవసరమౌతుంది. దానికోసం ఎండు చేపలు, గుడ్డు పెంకు, గవ్వలు వంటివి దాణాగా వేయవచ్చు

**కోళ్ళకు వచ్చే వ్యాధులు :**

1 కొక్కెర రోగం : రోగ కారకం – వైరస్

లక్షణాలు : పసుపు పచ్చ విరేచనాలు, మెడ వంకర పోవడం, అవయవాలు పని చేయకపోవడం

2 . అమ్మతల్లి : రోగ కారకం – వైరస్

లక్షణాలు : కోడి జుట్టు పైన, ముఖం పైన, తోక పైన పుండ్లలాంటి బుడిపెలు, నోరు, స్వరపేటిక, గొంతు, మెడ భాగంలో పొక్కులు ఏర్పడతాయి.

**ఏ రోగానికి ఎప్పుడు ఏ చికిత్స ?**

| క్ర.సం. | రోగం | రోజులు | టీకాలు |
|---|---|---|---|
| 1 | కొక్కెరోగం | 7 వ రోజు | లాసోట టీకా |
| 2 | కొక్కెరోగం | 14 వ రోజు | లాసోట టీకా |
| 3 | అమ్మతల్లి | 8 వారం | అమ్మతల్లి టీకా |
| 4 | కొక్కెరోగం | 9వారం | ఆర్ డి వి కే టీకా |
| 5 | కొక్కెరోగం | 18 వారం | ఆర్ డి వి కే టీకా |

■

# 'మాస్' ప్రేరణతో మహిళా సంఘాల ముందడుగు !

– భవాని

హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జి హెచ్ ఏం సి) పరిధిలో 'మహిళా అభివృద్ధి సొసైటి' (మాస్) నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల్లో , అవగాహన సదస్సులలో, ర్యాలీలలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల వంటల కార్యక్రమాలలో, డైట్ సర్వేలు, గృహ సందర్శన వంటి వివిధ కార్యక్రమాల్లో గత కొంత కాలంగా స్వయంసహాయ సంఘాల, సమాఖ్యల మహిళలు పాలుపంచుకుంటున్నారు. ఈ కార్య క్రమాలలో వాళ్ళు చూసిన, నేర్చుకున్న విషయాలను, సమాచారాన్ని తమ స్లం పరిధిలోని అందరికి ముఖ్యంగా గర్భిణిలకు, బాలింతలకు తెలియచెప్పే క్రమంలో వారంతట వారే స్వయంగా తక్కువ ఖర్చులో ఎక్కువ పోషకాలు గల వంటలు తయారు చేసి శంకేశ్వర్ బజార్, ఎన్టీఆర్ నగర్, భగత్‌సింగ్ నగర్‌లో జనసమూహం ఉన్నచోట వారి సంఘం, సమాఖ్య పేరుతో మేళాలను, ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటుచేసి, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పిస్తున్నారు. తమకు ఈ అవగాహన, ప్రోత్సాహం 'మహిళా అభివృద్ధి సొసైటి' వారు ఇచ్చారని వారు చెబుతున్నారు. ముఖ్యంగా తిరుపతిలో అవగాహన పర్యటన జరిపి శ్రీ పద్మావతి మహిళా సమాఖ్యల పనితీరు, వాళ్ళు ఎలా అభివృద్ధి చెందారు అన్న విషయాలు చూసి, తెలుసుకొని వచ్చిన తరువాత ఇక్కడ తమ సంఘాలను బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నట్టు వారు తెలిపారు. ■



నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ

# ఐపాడ్ బృందం క్షేత్ర సందర్శన, ఎఫ్ పి ఓ ల పరిశీలన !

-వడ్డే లక్ష్మీదేవమ్మ

అనంతపురం జిల్లా, తనకల్లు మండలంలో పని చేస్తున్న 'జనజాగృతి' సంస్థకు ఏపిమాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎ.పి.డి.యం.పి 'పల్లెజీవం' కార్యక్రమంలో పని చేసే అవకాశం లభించింది. తనకల్లు మండలంలోని తవలం, గెమేనాయక్ తాండ, మల్రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలను పల్లెజీవం కార్యక్రమం చేయడానికి ఎంపిక చేసుకున్నాము. గెమేనాయక్ తాండ గ్రామ పంచాయతిలోని రాతినేనాయక్ తాండ వద్ద 247 ఎకరాలను అభ్యసన క్షేత్రంగా ఎంపిక చేసి పనులను చేపట్టాము.

ఊతప్పగారి తో పాటు జన జాగృతి, ఏ.పి.మాస్, ఎఫ్.ఇ.యస్ కు చెందిన క్షేత్ర స్థాయి సిబ్బంది అందరూ ఈ క్షేత్ర సందర్శనలో పాల్గొన్నారు.

ముందుగా, తనకల్లు మండలంలోని జనజాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని వీరు పరిశీలించారు. ఫోటో గ్యాలరీ గురించి శ్రీ జయరాం, శ్రీ కృష్ణమూర్తి ఐ.యస్.యం సభ్యులకు వివరించారు. అనంతరం గండోదివారిపల్లెలోని క్లిక్ సెంటర్‌లో 'రత్నగిరి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం' బి.ఓ.డి సభ్యులతో సమావేశమైనారు.





ఒక సంవత్సరం తరువాత పల్లెజీవం కార్యక్రమం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను, ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్ పి ఓ ల) పనితీరును మదింపు చేయడానికి ఐపాడ్ నియమించిన 'ఐపాడ్ సూపర్‌వైజరి మిషన్' (ఐ.యస్.యం) సభ్యులైన డాక్టర్ చంద్రశేఖర్ పాథక్, డాక్టర్ విపి.సింగ్‌లతో పాటు అనుసంధానకర్తగా యస్.పి.యం.యు కు చెందిన శ్రీ నున్న వెంకటేశ్వరరావు, డి.పి.యం.యు – డి.పి.డి శ్రీ కృష్ణమూర్తి, ఏ.పి.డి లు శ్రీ శ్రీనివాసులు, ఏపిమాస్‌కు చెందిన శ్రీ మధుమూర్తి, శ్రీ జయరాం, శ్రీ గోపాల్‌రెడ్డి, శ్రీ రమేష్ రెడ్డి, శ్రీ గంగాధర్, జనజాగృతి సిబ్బంది బలరామ్ గారు యల్.టి.ఏకు చెందిన రవీంద్ర గారు,

బి.ఓ.డి సభ్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎఫ్.పి.ఓ లో ఎంతమంది సభ్యులు ఉన్నారు, ఏ ఏ కులాలవారు ఉన్నారు, సభ్యత్వ రుసుం ఎంత, వాటాధనం ఎంత, బ్యాంక్ ఖాతాలో ఎంత జమ చేశారు మొదలైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి చూశారు. ఇప్పటివరకు ఏమి పనులు చేశారు, ఇంక ఏమి చేయాలని అనుకుంటున్నారు, ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా తదితర వివరాలను తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. క్లిక్ సెంటర్ ఆవరణలో రైతులు ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ పనిముట్ల ప్రదర్శనను తిలకించారు. రైతులు శ్రీ మల్రెడ్డి, శ్రీ కృష్ణారెడ్డి ఒక్కో పనిముట్టు ద్వారా కలిగే

గుండెల్లో రగిలే కోపం బుర్రను పొగచూరేలా చేస్తుంది



ప్రయోజనాలను వివరించారు. తయారు చేసిన కొత్తరకాల పనిముట్లను గురించి, ప్రణాళికను గురించి వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 'బయో రిసోర్స్ సెంటర్' (బి.ఆర్.సి)ను వీరు తిలకించారు. సెంటర్లో నిలువ చేసిన వివిధ రకాల కషాయాలు, వాటి ఉపయోగాలను బి.ఆర్.సి సూపర్‌వైజర్ సుజాత గారు, శ్రీధరరెడ్డి గారు ఐ.యస్.యం సభ్యులకు వివరించారు. భవిష్యత్తులో బి.ఆర్.సి ద్వారా వ్యాపార లావాదేవీలను నిర్వహించనున్నట్లు సభ్యులు చెప్పారు. తయారు చేసిన ప్రణాళికలను చూపించారు. మండలంలోని మొగిలిచెట్ల తాండ వద్ద గిరిజనులతో 'క్రాప్ వాటర్ ప్లానింగ్', వాటర్ బడ్జెట్ పై చర్చించి పలు విషయాలను వివరించారు.

డాక్టర్ పాథక్ వాటర్ బడ్జెట్‌పై చర్చిస్తుండగానే వి.పి.సింగ్ కొంతమంది రైతులతో పొలాలకు వెళ్ళి పొలాలను పరిశీలించారు. వాటర్ కాన్సెప్ట్ గురించి తెలియజేశారు. అక్కడినుంచి దుసనివారిపల్లె దగ్గర కోళ్ళ పెంపకం 'బ్రీడర్ ఫార్మింగ్ షెడ్' యజమానితో చర్చించారు. అక్కడ గిరిజన మహిళలతో పల్లెజీవం కార్యక్రమం గురించి, సభ్యత్వం గురించి అడిగి తెలుసుకున్నారు.

గండోడివారిపల్లెలో భోజన విరామం అనంతరం రాతినెనాయక్ తాండాలో అభ్యసన క్షేత్రంలోని పొలాలకు చెరువు మట్టిని తరలించిన బయన్న కుంటను పరిశీలించారు అనంతరం అభ్యసన క్షేత్రంలోని పొలాలను పరిశీలించారు. ఎఫ్.పి.ఓ అధ్యక్షులు శ్రీ కృష్ణమూర్తి, సభ్యులు శైలజ గారు, సరస్వతి గారు, రత్నమ్మ గారు చెరువు మట్టి తరలింపు విషయాలను ఐ.యస్.యం సభ్యులకు తెలియజేశారు.

అనంతరం అభ్యసన క్షేత్రంలో వేసిన పంటలను పరిశీలించి మట్టి తోలిన పొలాలకు, మట్టి తోలని పొలాలకు వున్న తేడాను గుర్తించారు. రాతినెనాయక్ తాండాలో ఏర్పాటు చేసిన ' రైతు బడి ' కార్యక్రమాన్ని తిలకించారు. మన విత్తన కేంద్రాన్ని సందర్శించి, గొర్రెల కాపరులతో చర్చించి వివరాలు తెలుసుకొన్నారు. గోకులం గురించి డాక్టర్ గోపాలరెడ్డి ఐ.యస్.యం సభ్యులకు వివరించారు. ఐ.యస్.యం బృందం క్షేత్ర పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ■

## వర్షాకాలంలో తినకూడనివి...

వర్షాకాలంలో కొన్ని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆ జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం బారిన పడకుండా ఆనందంగా ఉండొచ్చు.

- పళ్ళరసాలు, చెరకు రసాలు, లస్సీ, పెరుగు మానుకోండి.
- అజీరాన్ని కలిగించే ఆలు, మొలకెత్తిన గింజలు, కందులు, గోరుచిక్కుడు వంటివి తినకపోవడం మేలు
- కొవ్వును పెంచే సమోసా, పకోడీలు, వేపుళ్ళు, బర్గర్లు అధికంగా ఉప్పు ఉండే పచ్చళ్లు మానేయాలి.
- ఆవ, నువ్వుల నూనెలకి బదులు మొక్కజొన్న, ఆలివ్ నూనెలు వాడితే జీర్ణ సమస్యలు తలెత్తవు.
- పచ్చి పదార్థాల్లో వుండే ఎంజైమ్‌లను జీర్ణవ్యవస్థ సరిగా జీర్ణం చేసుకోలేదు. కనుక ఈ సీజన్‌లో ఆ ఆహారానికి దూరంగా ఉండాలి.
- రెస్టారెంట్లు, పార్టీలు, ఫంక్షన్లలో ఆకుకూరల వంటకాలు, సలాడ్‌లు తినొద్దు. ఇటువంటి ప్రదేశాల్లో సూక్ష్మజీవులు వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుంది.
- పుచ్చకాయ, కీర వంటి నీరు కలిగిన పళ్లను బండ్ల మీద ముక్కలు కోసి అమ్ముతుంటే తినొద్దు.
- పచ్చి గుడ్డు, సీ ఫుడ్‌లను తినకపోవడమే మంచిది.

■

**వివేకం వంద ఏళ్ళుగా చేసిన కృషిని అవివేకం ఒక్క క్షణంలో భస్మంచేస్తుంది**

# తెలుసుకుని, తెలియజెప్పిన సమాఖ్య లీడర్ !

– శిల్ప

భగత్‌సింగ్‌నగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా సూర్యోదయ, చంద్రోదయ అనే సమాఖ్యలు బాగా పని చేస్తుండేవి. కాని గత కొన్ని నెలలుగా వారు అంతర్గత కారణాల వల్ల సమావేశం జరపుకోవడం లేదు. మహిళాభి వృద్ధి సొసైటీ (మాస్) సభ్యులు ఆ స్లమ్‌లో గృహ సందర్శనలు, ప్రవర్తనలో మార్పుతెచ్చే కార్యక్రమాలు, అమరవీరుల ర్యాలీలు





జరుపుతున్నప్పుడు మాస్ బృందం నాయకులతో, సభ్యులతో, వారికి పరిచయం ఏర్పడింది. వారు మొదటగా ఆ స్లమ్‌లోని సంఘాల పరిస్థితిని వివరిస్తూ మాస్ సభ్యులతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఆ తరువాత భగత్‌సింగ్ నగర్ సమాఖ్య లీడర్ శ్రీమతి పద్మ మహిళలకు సంబంధించిన విషయాలపై పని చేయడం తనకిష్టమని, మాస్ (మహిళా సమాఖ్య సభ్యులు) కార్యక్రమాలలో తాను పాల్గొంటానని ఆసక్తి కనబరచింది. ఆమె ఆసక్తిని గమనించి, శ్రీమతి పద్మను మాస్ నిర్వహించే ప్రతి సమావేశానికి ఆహ్వానించటం జరిగింది. ఆ తరువాత శ్రీమతి పద్మను మాస్ నిర్వహించే ప్రతి సమావేశానికి ఆ్వానించడం జరిగింది.

ఈ విధంగా వెల్ బేబీ షో, రోజువారీ ఆహార నియమాల సమావేశం, భాగస్వాముల సమీక్షా సమావేశం, మహిళా దినోత్సవం, సమాఖ్య నాయకుల, సంఘ నాయకుల శిక్షణ కార్యక్రమాలలో తరచూ పాల్గొనడం ద్వారా ఆమెలో మాస్ కార్యక్రమాల పట్ల ఆసక్తి మరింత పెరిగింది. ఆ తరువాత తను అంగన్ వాడి పనితీరును గమనించడానికి వెళ్ళడం, బృంద సభ్యుల చర్చలో, సంఘ సభ్యులను సమావేశ పరచడంలో తోడ్పడడం, కొత్త గర్భిణులను గుర్తించడం, 24 గంటల పోషకాహార సర్వే, ప్రవర్తనలో మార్పుకోసం కౌన్సెలింగ్ మొదలైన అంశాల గురించి తన సొంత బాధ్యతగా సభ్యులను సమావేశ పరిచి వారికి మాస్ గురించి, పోషకాహార ప్రాధాన్యత గురించి వివరించింది. ఇవే అంశాలను జూన్ 15 న జరిగిన ఎస్ఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశంలో కూడా మాట్లాడటం జరిగింది.

భగత్‌సింగ్‌నగర్‌లో మే నెలలో 13/05/2019 బిసిసి కోసం వెళ్లగా అక్కడ భగత్‌సింగ్‌నగర్ ఎస్ఎల్ఎఫ్ లీడర్‌గా ఉన్న శ్రీమతి పద్మ 'బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్' కోసం మహిళలను సమావేశపరిచి అక్కడికి వచ్చిన మహిళల పరిచయ కార్యక్రమం ముగిసిన తరువాత, తాను మాట్లాడుతూ క్రిందటి నెలలో మహిళాభివృద్ధి సొసైటీ వారు ఏర్పాటు చేసిన ఎస్ఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశం గురించి వివరించి, ఆ సమావేశంలో తాను తెలుసుకున్న విషయాలను ఈ బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్ (బి సి సి) సమావేశంలో వివరించడం జరిగింది. మొదటగా మాస్ వారు గర్భిణులు, బాలింతల కోసం పని చేస్తారని చెబుతూ, రక్తంలో హిమోగ్లోబిన్ ప్రాముఖ్యం, అది వుండవలసిన స్థాయి గురించి, గర్భంలోని శిశువుకు, తల్లికి శక్తినిచ్చే రోజువారీ ఆహార నియమాల గురించి పద్మ వివరించారు.

ముఖ్యంగా ఆ వాడలోని వారి ఆహార అలవాట్లు పద్మకు తెలియడంవల్ల వారితో కలసిపోయి ప్రతి విషయాన్ని వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. బిసిసిలో పాల్గొన్న ప్రతి మహిళ తాను ఇకనుంచి రోజువారీ ఆహార నియమాలు తప్పక పాటిస్తానని, రోజూ అల్పాహారం తీసుకుంటానని చెప్పడం విశేషం. ■

మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !

# 'ఆరోగ్య బంధన్' తో బలపడిన అనుబంధం !


– డి. నాగలక్ష్మి

గర్భవతులు, బాలింతలు, 6 నుండి 18 నెలల లోపు పిల్లల ఆరోగ్యం పౌష్టికాహారం గురించి మహిళా స్వయం సహాయ సంఘాల ద్వారా అవగాహన కలిగిస్తూ, వారిని కూడా మన కార్యక్రమాలలో, గృహ సందర్శనలో భాగస్వాములుగా చేస్తూ కలసి పని చేస్తున్నాము. ఇలా సంఘాలను సొంతంగా కార్యక్రమాలను నిర్వహించుకునేలా చేయడంలో భాగంగా సంఘాల ద్వారా 'ఆరోగ్య బంధన్' కార్యక్రమాన్ని నిర్వహింప జేయడం మరో విశేషం !

గర్భవతులు, బాలింతలు, 6 నుండి 18 నెలల లోపు పిల్లలు తీసుకునే రోజువారీ ఆహారంలో వైవిధ్యత ఉండాలని అని ప్రతి గర్భిణి, బాలింత ఇంటికి వెళ్ళి, వారే స్వయంగా ఆహార వైవిధ్యతను గురించి వివరించి ఆహారపు రంగులను గుర్తు చేసే 'ఆరోగ్య బంధన్'ను ఆమె చేతికి కట్టడం, చిన్నపిల్లలకు కాలికి ఆరోగ్య బంధన్‌తో పాటు మువ్వలు కలిపి కట్టడం ద్వారా తెలియ జేయడమే ఈ కార్యక్రమ విధానం. ఈ ఆరోగ్య బంధన్‌ని చూసినప్పుడల్లా ప్రతిరోజూ వారి ఆహారంలో ఈ రంగులున్న పదార్థాలు ఉండేలా చూసుకుంటా రన్నది ఈ ప్రయత్నానికి మూలం. ఇలా చేయడం ద్వారా గర్భవతులకు, బాలింతలకు సంఘాల సహకారం ఎప్పటికీ ఉంటుందని నేరుగా సందేశం పంపినట్లయింది.

సంఘం వారు కూడా బాలింతలను, గర్భవతులను,





చిన్నపిల్లలను నేరుగా ఇంటికి వెళ్ళి కలవడం ద్వారా వారి పరిస్థితులను, పోషణ విధానాన్ని తెలుసుకోవడానికి, కుటుంబ సభ్యులతో ఆత్మీయ పరిచయాలు ఏర్పడేందుకు దోహదం చేసింది.

ఆరోగ్య బంధన్ లోని రంగులు అవి సూచించే ఆహారపదార్థాలు : 1.ఆకుపచ్చ రంగు: ఆకుకూరలు 2.తెలుపు: పాలు పెరుగు, గ్రుడ్డు 3. పసుపు: నిమ్మజాతి పండ్లు, అరటి, మామిడి, పప్పుదినుసులు, 4. నారింజ రంగు: బొప్పాయి, గుమ్మడి, క్యారెట్ మొదలైన కాయగూరలు. ■

## నిరుపేదకు ఇల్లు కట్టించిన ఎన్నారై జంట!

*భర్తను కోల్పోయి నిలువ నీడ లేక ముగ్గురు పిల్లలతో రోడ్డు మీద పడిన ఓ మహిళకు తమ కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా ఇల్లు నిర్మించి ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకుందో ఎన్నారై జంట. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కటికెనపల్లి గ్రామానికి మల్లీశ్వరి భర్త కొద్ది నెలల క్రితం మరణించాడు. అప్పటివరకూ మల్లీశ్వరి అద్దెకుంటున్న ఇంటిని యజమాని ఖాళీ చేయించడంతో ఆ కుటుంబానికి ఇల్లు లేకుండా పోయింది. ముగ్గురు పిల్లలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమె గురించి గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న కరీంనగర్‌కు చెందిన ఎన్నారై ముక్క నవీన్ కుమార్, సూర్య ప్రియదర్శిని దంపతులు స్పందించారు. తమ కుమారుడి జన్మదిన కానుకగా రూ. 1.40 లక్షలు ఖర్చుతో ఇల్లు నిర్మించి మల్లీశ్వరికి ఇచ్చారు.*

# కంద, చేమదుంప నాటుకుందాం

చేమదుంపలు, కంద, పసుపు దుంపలు... వగైరా దుంపజాతులను నాటుకోవడం ప్రారంభించవచ్చు. ఇవి మొలవడానికి దాదాపు పది, పదిహేను రోజులు పడుతుంది. చేమకూర దుంపలు నాటుకోవడం వల్ల ఒక ఆకుకూర కూడా అందుబాటులోకి వస్తుంది. చేమ ఆకులను పప్పులతో కలిపి కూరగా వండుకోవచ్చు. చివరికి దుంపలు కూడా వాడకానికి వస్తాయి.

దుంపల్ని నాటాక మడిలోని మట్టిని నీటితో తడపాలి. కంద దుంపల్ని కూడా షాపు నుంచి తెచ్చుకోవాలి. ఇవి పెద్ద దుంపలు దొరుకుతాయి. ఒకసారి వాటిని నాటుకుని పండిస్తే చుట్టూ చిన్న చిన్న దుంపలు కూడా ఊరుతాయి. వాటిని తిరిగి విత్తనం దుంపలుగా వాడుకోవచ్చు. కంద దుంపల్ని మాత్రం అర అడుగు నుంచి ముప్పావు అడుగు దూరం ఉండేలా నాటుకోవాలి.







ఈ దుంపలు చాలా రోజులు నిల్వ ఉంటాయి. కూరగాయలు లభించని రోజుల్లో నిల్వ ఉన్న దుంపలను కూరకు వాడుకోవచ్చు. మిద్దెతోటలు, పెరటితోటల్లో అన్ని రకాల దుంపజాతులను ఇప్పుడు క్రమంగా నాటుకోవచ్చు. మడుల్లో తగినంత మాగిన ఎరువులు... పశువులు, గొర్రెలు, మేకల లేదా సొంతంగా తయారు చేసుకున్న ఎరువులు కలుపుకుని సిద్ధం చేసుకోవచ్చు.

చేమదుంపలు కూరగాయల షాపులలో లభిస్తాయి. చిన్న చిన్న దుంపలు తెచ్చుకోవాలి. ఎటుచూసినా దుంపకూ దుంపకూ నాలుగు అంగుళాల దూరం ఉండేలా ఒక్కో దుంపను నాటుకోవాలి. మట్టిలో నిండా మునిగేలా నాటాలి. దుంపలపై అరంగుళం మట్టి ఉండేలా చూసుకోవాలి.



పసుపు దుంపలు రైతుల వద్ద నుండి సేకరించుకోవాలి. వీటిని కూడా ఎటు చూసినా అర అడుగు దూరానికి ఒకటి చొప్పున నాటుకోవాలి. కాస్త అటుయిటయినా ఫరవాలేదు. దుంపల్ని నాటాక మట్టి కొట్టుకుపోకుండా నీళ్లు పోసేటప్పుడు జాగ్రత్తగా పొయ్యాలి. నాటాక మడులను సొంతం తడపాలి. తరువాత ప్రతిరోజూ స్వల్పంగా నీరు పెట్టాలి. అంటే ఎండలకు పైన మట్టిపొర ఎండుతుంది. అది తడిసేలా మాత్రమే నీరు పెట్టాలి. ఎక్కువ పెట్టకూడదు. అది కూడా సాయంత్రం పూట పెట్టాలి. పదిహేను రోజుల్లో అన్ని దుంపలూ మొలుస్తాయి. తర్వాత ఎలాగూ వర్షాకాలం వస్తుంది కనుక అవసరాన్ని బట్టి నీరు పెడుతుండాలి. దుంపజాతులకు పెద్దగా చీడపీడలు రావు. పండించడం సులభం. ■

ఆశాభావం అంటే సమస్యలలో పరిష్కారాన్ని , ఆటంకాలలో అవకాశాలను చూడగలిగేలా చేసేది

# బి.పి.ని అదుపుచేసే ఆహారనియమాలు

పండ్లు, కాయగూరలు, గింజలు, పప్పులు, దుంపలు, సుగంధద్రవ్యాలు మానవుడికి ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన వరం. ఆయా సీజన్లలో పండే పండ్లను ఆరగించడం మనకు తరతరాలుగా తెలిసిందే. అన్నంతో కూడా ప్రకృతి సిద్ధమైన పండ్లు, కూరగాయలు ఇతర తృణ ధాన్యాలను ఆహారంగా తీసుకుని జీవించినట్లయితే శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు లభిస్తాయి . ఇదే ఉత్తమమైన జీవన విధానమని పకృతి వైద్యుల నమ్మకం. జీవం ఉన్న ప్రతి జీవికి ఆహారం అత్యవసరం. పిండి పదార్థాలు, మాంస కృత్తులు, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, రోగనిరోధక శక్తికి కావలసిన విటమిన్లు , శరీర పోషణకు రక్షణకు అవసరమయ్యే పోషకాలు మొదలైన పదార్థాలను ఆహారంగా పేర్కొనవచ్చు. ఇవి కాక శరీరానికి ఉత్సాహాన్నిచ్చే కాఫీ, టీ లాంటివి కూడా ఆహారపదార్థాల కోవలోకి వస్తాయి.



**గుప్పెడంత గుండె ...**

మన ఛాతీలో రెండు ఊపిరితిత్తుల మధ్య పెరికార్డియం అనే పొరని కప్పుకొని నియమంగా స్పందించే ఒక అవయవమే గుండె. ఈ గుండె తన క్రమాన్ని,నియమాన్ని తప్పి ఎక్కువగా కొట్టుకున్నా, తక్కువగా కొట్టుకున్నా అది మన జీవి తాన్ని శాసించే గుండె జబ్బు అవుతుంది. గుండె జబ్బులలో ఒకటి రక్తపోటు. గుండెలోను, రక్తనాళాలల్లో ఉండే రక్తం వాటి గోడలపై చూపించే వత్తిడిని రక్తపోటు లేదా బ్లడ్‌ప్రజర్ అంటారు. ఇది ముఖ్యంగా రెండు స్థితులపై ఆధారపడి ఉంటుంది. 1.రక్తాన్ని పంపు చేసే గుండె కండరాల శక్తి 2. పంపు చేసిన రక్తాన్ని తీసుకునే రక్తనాళాల శక్తి.

**జాగ్రత్తలే రక్ష !**

బ్లడ్ ప్రెషర్ వచ్చాక నయం కావడమన్నది ఉండదు. కాని జీవనవిధానంలో తగిన మార్పుల ద్వారా రక్తపోటు రాకుండా జాగ్రత్తపడొచ్చు. వచ్చినా చిన్న చిన్న జాగ్రత్తల ద్వారా నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**ఉప్పు (సోడియం క్లోరైడ్) :** ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించాలి. రోజుకు 5గ్రాముల కంటే మించి ఉప్పు వాడొద్దు. ప్రాసెస్డ్, ప్యాకేజీ పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్స్, క్యాన్డ్ పదార్థాలను తినడం బాగా తగ్గించాలి. ఎందుకంటే వీటిలో అదనపు ఉప్పు ఉంటుంది. సోడియం క్లోరైడ్ బి.పి.ని అధికం చేస్తుంది.

**పొటాషియం:** ఇది బి.పి.ని తగ్గి స్తుంది. బీన్స్, జరాణీలు, నట్స్, పాలకూర, క్యాబేజీ, కొత్తిమిర, అరటి, బొప్పాయి, ద్రాక్ష, కమలా, నారింజ, నిమ్మ వంటి పండ్లలో పొటాషియం లభిస్తుంది. తక్కువ సోడియం, ఎక్కువ పొటాషియం గల పండ్లు రక్తపోటు తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి. కొబ్బరి నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది.

**కొవ్వు పదార్థాలు :** ఇవి రక్తంలో కొలెస్టిరాల్ పెరిగి బిపి ఎక్కువయ్యేందుకు కారణమవుతాయి. నూనెలు, ద్రవ రూపంలో ఉన్న కొవ్వుల వాడకం తగ్గించాలి. పచ్చళ్ళు, ఆవకాయ, కారం, ఊరగాయ వంటి వాటిలో నూనెలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తక్కువ మోతాదులో వాడాలి. జంతు మాంసాలలో కొవ్వు ఎక్కువ ఉంటుంది.

**ఆహారంలో మార్పులు:** ఎక్కువ పీచు పదార్థం ఉన్నవి వాడాలి. పండ్లు, కాయగూరలు, ఆకుకూరలు, పప్పులు వాడాలి. రోజుకు కనీసం 5 సార్లు పండ్లు, కూరగాయలు తింటుండాలి. సాస్‌లు, ఊరగాయలు బాగా తగ్గించాలి.

**ఆల్కహాల్ :** ఈ అలవాటు ఉండే వారు మానివేయాలి. లేదా చాలా పరిమితిలో ఉండాలి. ఆల్కహాల్ ఎక్కువ కేలరీలు ఉన్న పానీయం.

**పొగ త్రాగడం :** నికొటిన్ ఉండడము వలన రక్త నాళాలపై ప్రబావం చూపుతుంది. పొగతాగడం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోతాయి. ■

స్వప్నానికి సంకల్పానికి ఒకటే తేడా . . . నిదురపడితే వచ్చేది స్వప్నం, నిదురపట్టనివ్వనిది సంకల్పం

# వాటర్‌షెడ్ వనరులు పంచాయతీలకు అప్పగింత !

- ఎన్. ప్రహ్లాద

**భూ**గర్భ జలాల అభివృద్ధే సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం (ఐడబ్ల్యూఎంపీ) లక్ష్యమని చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం ఎంపీడీవో శ్రీ లక్ష్మీపతి పేర్కొన్నారు. జులై 27 వ తేదీన శ్రీ లక్ష్మీజనార్ధన స్వామి ఆలయం ఆవరణలో వాటర్‌షెడ్ విజయోత్సవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీమాస్ పీఓ శ్రీ ప్రహ్లాద మాట్లాడుతూ 2011 నుంచి 2019 వరకు ఏపీమాస్ సంస్థ ద్వారా చొక్కాండ్లపల్లె మెగా వాటర్‌షెడ్ ప్రాజెక్టును అమలు చేసినట్లు తెలిపారు.



మండలంలోని రామసముద్రం, చొక్కాండ్లపల్లె, కురిజల, కేసీపల్లె, మూగవాడి, ఊలపాడు పంచాయతీల్లో 3851 హెక్టార్ల భూమిలో వివిధ రకాల పనులకు ప్రభుత్వం 462.12 లక్షల రూపాయలు మంజూరు చేయగా ఏపీమాస్ సంస్థ 439.19 లక్షల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. 95 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. సహజ వనరుల నిర్వహణతో పాటు పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. 2019 నాటికి పథకం ముగియడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెగా వాటర్‌షెడ్ పథకంలో చేపట్టిన కార్యక్రమాలను తదనంతర నిర్వహణ కోసం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించినట్లు శ్రీ ప్రహ్లాద తెలిపారు.

వాటర్‌షెడ్ పథకంలో ఏర్పాటుచేసిన ఆస్తుల వివరాల రిజిస్టర్లను ఎంపి డి ఓ ఆయా గ్రామాల బాధ్యులకు అందజేశారు. ఊలపాడు పంచాయతీకి సంబంధించిన రిజిస్టర్లను పంచాయతీ కార్యదర్శి శ్రీ విష్ణువర్ధన్‌కు అందజేశారు. మిగతా ఐదు గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం కార్యదర్శులు లేనందున వాటర్‌షెడ్ కమిటీ సభ్యులకు రిజిస్టర్లను అంద జేశారు. వాటర్‌షెడ్ ద్వారా ఏర్పాటైన ఆస్తులు ఇకపై గ్రామ పంచాయతీలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ కార్యక్రమంలో నిర్మించిన, మరమ్మతు చేసిన, ఏర్పాటుచేసిన వనరుల వివరాలు : 35 నీటి తొట్టెలు, 23 సోలార్ వీధి దీపాలు, 81 ఎరువు తొట్టెలు, 9 ధాన్యపు కళ్ళాలు, 22 సందు రాతి కట్టడాలు, 10 రాతి డ్యాంలు, 171 ఫారంపాండ్లు, 153 డీవోపీలు, 9 నీటి కుంటలు, 71 కుంటల మరమ్మతులు, 106 చెక్‌డ్యాంలు, 2 ఉపరితల నీటి నిల్వ కుంటలు, 6 ఇంజెక్షన్ బోరుబావులు, 8 చోట్ల రోడ్లుకిరువైపులా మొక్కలు నాటడం, 13 జీవ కంచెలు, 124 మంది రైతులకు మామిడి మొక్కల పెంపకం. 142 మందికి గడ్డి పెంపకానికి సాయం అందించడం జరిగింది. జీవనోపాధుల పెంపుదలలో భాగంగా 6 పంచాయతీల్లో ఆవుల కొనుగోలుకు రూ. 8 లక్షలు, 250 మందికి టార్పాలిన్ పట్టలు, 67 మందికి డీజిల్ ఇంజన్లు, 60 తైవాన్ స్ప్రేయర్లు, 9 మందికి గడ్డి కత్తిరించే యంత్రాలు, ముగ్గురికి పాలు పితికే యంత్రాలు, 74 మందికి విత్తనపు పొట్లేళ్ళు ఇచ్చినట్టు శ్రీ ప్రహ్లాద తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్ పి ఓ) అధ్యక్షులు శ్రీ చెంగారెడ్డి, రామసముద్రం జి ఆర్ ఎస్ అధ్యక్షులు శ్రీ క్రిష్ణప్ప, కురిజాల జి ఆర్ ఎస్ అధ్యక్షులు శ్రీ రమణ, ప్రదర్శన క్షేత్ర రైతు శ్రీ రెడ్డెప్ప, జి ఆర్ ఎస్ కార్యదర్శి సరోజమ్మ గారు తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. ఇంకా వెలుగు సీసీ శ్రీ రామాంజనేయులు, ఎన్ ఆర్ ఇ జి ఎస్ – టీఓ శ్రీ సురేశ్, ఇ ఫ్రెష్ ఎఫ్ డి సి – ఏ ఎం శ్రీ రాకేష్‌కుమార్, రైతులు, వాటర్‌షెడ్ కమిటీల పూర్వపు అధ్యక్షులు, సభ్యులు, రైతుమిత్రలు, ఏపీమాస్ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీ ప్రదీప్ కుమార్ వందనసమర్పణతో విజయోత్సవ సమావేశం ముగిసింది. ■

లేనిదాని గురించి కుంగిపోకుండా వున్నదానితో సంతృప్తిగా, ప్రశాంతంగా జీవించడమే ఆనందం









అగలి, గుడిబండ, రోళ్ల మండలాలలో ఎఫ్ పి ఓ ల
మొదటి వార్షిక సర్వసభ్య సమావేశ దృశ్యాలు!











MAHILA SADHIKARATHA
Publication Date: 01-08-2019; Posting Date: 05-08-2019

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20

# దక్షిణ దేశాలకు దక్షిణ దేశాల సహకార బృందం పర్యటన దృశ్యాలు





















బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089